J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 17 27.09.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## చినబాబు చేతిలో.. 'రెడ్'బుక్‌తో పాటు 'రెడ్డీ'బుక్



- ఉద్యోగుల బదిలీలలో స్పష్టంగా బయటపడ్డ పక్షపాతం
- కమ్మ-కాపు ఒక్కటై రెడ్లకి చెక్ పెట్టాలని చూస్తున్నారా?
- మొన్నటి ఎన్నికలలో రెడ్ల మద్దతుతోనే గట్టెక్కిన సంగతి మర్చిపోయారా?
- కుల రాజకీయాలకి వేదికగా ఆంధ్ర పాలిటిక్స్!

వందరోజుల క్రితం ఆంధ్రలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కుల రాజకీయాలకి తెరలేపుతోందా...? 'రెడ్'బుక్‌తో పాటు 'రెడ్డీ'బుక్‌ని కూడా చినబాబు చేతిలో పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకి వ్యూహం రచిస్తున్నారా..?? అనాదిగా ఉత్తర దక్షిణ ధృవాలుగా ఉన్న కమ్మ - కాపు ఒక్కటై రెడ్లపై సవారిచేయాలని చూస్తున్నారా..??? మొన్నటి ఎన్నికలలో కూటమిని గట్టెక్కించ డంలో రెడ్లు కూడా కీలక పాత్ర పోషించారన్న విషయం కూటమి నేతలు అప్పుడే మర్చిపోయారా...???? ఇలాంటి ప్రశ్నలన్నిటికీ రాజకీయ పరిశీలకుల నుండి అవుననే సమాధానాలే వినపడుతున్నాయి.

10 లో

### కన్నుమూసిన ఆపన్నుల అమ్మ

## దివికేగిన మాగుంట పార్వతమ్మ



మాగుంట ఇంటి జ్యోతి ఆరిపోయింది. దివంగత సుబ్బరామరెడ్డి నిష్క్రమణ తరువాత ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న మాగుంట పార్వతమ్మ సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం గం.6.27 నిముషాలకి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అస్వస్థతో ఉన్న పార్వతమ్మ తమ 77వ ఏట చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు.

మాగుంట కుటుంబానికి ఆమె వెలుగు. ఇంటికి దీపం ఇల్లాలు అన్న మాటకి ఆమె నిలువెత్తు రూపం. దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి సేవా వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని ఈనాటికీ అటు ఒంగోలు, ఇటు నెల్లూరు జిల్లాల ప్రజల గుండెల్లో కనిపించే దైవంగా కొలువయ్యారు పార్వతమ్మ. సరిగ్గా అయిదు నెలల క్రితం కళ్ళ ముందే తన చెట్టంత కొడుకు విజయ్‌బాబు కూలిపోవడంతో

5 లో



# పేదలకు కడుపునిండా అన్నం పెడుతున్న..

# 'మంచి ప్రభుత్వం'

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

పేదలకు కేవలం అయిదు రూపాయలకే కడుపునిండా అన్నం పెడుతున్న తమ ప్రభుత్వం ఎంతో మంచి ప్రభుత్వమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. పేదవారి బాగోగుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్ వంటి పలు పథకాలను పున: ప్రారంభించి మరింత సమర్ధవంతంగా అమలుచేస్తున్నారని ఆయన కొనియాడారు. ఈనెల 22న స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఆయన నెల్లూరు 33వ డివిజన్‌లో ఇల్లిల్లూ తిరుగుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఈ వంద రోజుల్లో చేసిన మంచి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. 3వేల పెన్షన్‌ను 4వేలకు పెంచి ప్రతినెలా ఠంచనుగా ఇంటింటికీ వచ్చి లబ్ధిదారులకు పింఛను అందజేస్తుండడంతో ప్రభుత్వానికి మంచి ఆదరణ లభిస్తోందన్నారు.

### వైసీపి కార్పొరేటర్లు టీడీపీలోకి :

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో నెల్లూరు నగరపాలకసంస్థకు చెందిన పలువురు వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు ఈనెల 21న తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. వైసీపీకి చెందిన



32, 35, 41 డివిజన్ల కార్పొరేటర్లు తాళ్ళూరు అవినాష్, యాకసిరి వాసంతి, కువ్వాకొల్లు విజయలక్ష్మి, 35, 41 డివిజన్‌ల వైసీపీ ఇన్‌చార్జిలు యాకసిరి శరత్‌చంద్ర, కువ్వాకొల్లు బాబ్జిలు కూడా టీడీపీలోకి రావడంతో వారందరికీ శ్రీధర్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైకాపాకి రాజీనామా చేసి, మంచి మనసుతో టీడీపీలోకి వస్తున్న వారందరినీ తాము గౌరవంగా చూసుకుంటామన్నారు. అందరం కలసి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేద్దామని ఆయన వైకాపా వారికి ఆహ్వానం పలికారు.

# ఆర్‌ఎస్‌ఆర్‌కు..మేరిగ పరామర్శ



ఇటీవల ఆనారోగ్యం పాలై చికిత్సలు చేసుకుని ఆసుపత్రి నుంచి తిరిగివచ్చిన స్థానిక వైకాపా నాయకుడు, వైకాపా 20వ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్)ను వైకాపా గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మేరిగ మురళి ఈనెల 21న పరామర్శించారు. నెల్లూరులోని ఆయన నివాసానికి వచ్చిన మేరిగ, ఆర్‌ఎస్‌ఆర్ యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని, త్వరలోనే ఆయన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో..సంకటహర చతుర్థి

సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఈనెల 21న నగరంలోని విఘ్ననాశకుడైన శ్రీ విఘ్నేశ్వరుని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవలు జరిగాయి. గణేశుని శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు చేశారు. ఎలాంటి సంకటాలు లేకుండా తమ జీవితాలు సాగాలని భక్తులు స్వామివారిని ప్రార్థించారు. పెద్దసంఖ్యలో మహిళా భక్తులు వినాయకుని మందిరాలకు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు.






## జడ్పీ సీఇఓ..

# కన్నమనాయుడు బదిలీ

నెల్లూరు జిల్లా పరిషత్ సీఇఓగా పని చేస్తున్న కన్నమనాయుడును కృష్ణాజిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఆ స్థానంలో ఆత్మకూరు ఏపీడీ ఖాదర్‌బాషాను జడ్పీ సీఇఓగా నియమించారు. అదేవిధంగా, జడ్పీలో డెప్యూటి డీఇఓగా ఉన్న భూపతి చిరంజీవిని ఒంగోలు జడ్పీ సీఓగా బదిలీ చేశారు.

## డీఆర్డీఏ పీడీగా..

# నాగరాజకుమారి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నాగరాజకుమారిని ప్రభుత్వం నియమించింది. ఆమె గతంలోనూ నెల్లూరులో పనిచేశారు. కృష్ణాజిల్లా నీటియాజమాన్య సంస్థ ఆర్థిక విభాగం మేనేజర్‌గా ఉన్న ఆమెను, తాజాగా ప్రభుత్వం నెల్లూరులో డీఆర్డీఏ పీడీగా నియామకం చేసింది. అదేవిధంగా, జిల్లా పంచాయతి అధికారి(డీపీఓ)గా శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 22న ఉత్తర్వులిచ్చింది. నెల్లూరు డీపీఓగా ఉన్న సుస్మితారెడ్డిని శ్రీకాళహస్తి డీఎల్ డీఓగా బదిలీ చేశారు.

## పేకాట బ్యాచ్

# దొరికిపోయింది

### పోలీసులకు చిక్కిన 22 మంది

నెల్లూరులోని ఓ హోటల్‌లో గుట్టు చప్పుడు కాకుండా పేకాటాడుతున్న 22 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట స్థావరంగా ఉన్న స్థానిక బీవీనగర్ వనంతోపులో ఉన్న ఆ హోటల్‌పై నగర డీఎస్పీ ఆధ్వర్యంలో, వేదాయపాలెం సీఐ కిశోర్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలసి ఆకస్మికంగా దాడిచేసి, రెండు గదుల్లో పేకాటాడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 65వేల రూపాయలతో పాటు, 6 మోటార్‌బైక్‌లు, 3 కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్ళతో పాటు ఆ హోటల్ యజమాని, మేనేజర్‌లపై కూడా కేసు నమోదు చేశారు.




# దాతృత్వం చాటుకున్న 'నారాయణ' కుమార్తెలు

## ● రెండు తెలుగు రాష్ట్రాలకు..రూ.5 కోట్ల విరాళం

వరద బాధితులను ఆదుకోవడంలో నెల్లూరులోని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకుంది. తమ తండ్రి అయిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన కుమార్తెలు సింధూర, షరణి ఆదర్శవంతంగా నిలిచారు. ప్రకృతి వైపరీత్యానికి గురైన రెండు తెలుగు రాష్ట్రాలను ఆదుకునేందుకు తమవంతుగా భారీ విరాళం ప్రకటించి సీఎం సహాయనిధికి అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పొంగూరు సింధూర, పొంగూరు షరణి, ప్రెసిడెంట్ కె.పునీత్ కలిసి, విజయవాడ వరద బాధితుల కోసం రూ. 2.5 కోట్ల చెక్‌ను అందజేశారు. బాధిత ప్రజలను ఆదుకునేందుకు తామెప్పుడూ ముందుంటామని వారు చెప్పారు. సీఎం చంద్రబాబు నారాయణ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. అదేవిధంగా తెలంగాణా వరద బాధితుల సహాయార్థం నారాయణ విద్యాసంస్థల తరఫున మరో రూ. 2.5 కోట్ల రూపాయల విరాళం అందజేశారు. తెలంగాణా రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారు కలసి విరాళం చెక్‌ను అందజేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి నారాయణ విద్యాసంస్థల వారి మానవీయ సేవలను కొనియాడారు.





## కోటి రూపాయల విరాళమిచ్చిన డా. బొల్లినేని భాస్కర్‌రావు

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఇటీవల తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి కోటి రూపాయల విరాళాన్ని అందిస్తున్న కిమ్స్ ఆసుపత్రుల అధినేత, మన నెల్లూరీయులు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, ఆయన కుమారుడు బొల్లినేని అద్విక్.

# గ్రావెల్, మట్టి మాఫియాలను వదలం

## - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

సర్వేపల్లి నియోజకవర్గంలో గత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అండదండలతో వైకాపా నాయకులు మట్టిని, గ్రావెల్‌ను, ఇసుకను, క్వార్ట్జ్‌ను విపరీతంగా దోచుకున్నారని, ఆ మాఫియాలను వదిలే ప్రసక్తే లేదని, వాటన్నిటిపై విచారణ జరిపిస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 25న వెంకటాచలం మండలంలోని ఎగువమిట్ట గ్రామంలో ఆయన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని, ప్రజలకు తెలుగు దేశం ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువుల్లో దాదాపు 11 లక్షల టన్నులకు పైగానే మట్టిని, గ్రావెల్‌ను దోచుకున్నారని, నియోజకవర్గంలో ఎక్కడ చూసినా వైకాపా అక్రమాలు, దౌర్జన్యాలే తప్ప మరేమీ కన్పించలేదని అన్నారు. ఈ దోపిడీలన్నిటిపై



విచారణ చేయిస్తామని చెప్పారు. తెలుగు దేశం ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైందన్నారు. అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలులోకి వస్తున్నాయని తెలిపారు. సంక్షోభ సమయంలో కూడా రాష్ట్రాన్ని కష్టాల నుంచి గట్టెక్కించే సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబని, ఆయన ముఖ్యమంత్రిత్వంలో రాష్ట్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రజలకు వివరించారు. వైకాపా అయిదేళ్ళ పాలనలో ఏనాడూ ఏ నాయకుడూ ప్రజల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఈ మండలంలో ఇస్కపాళెం కాలువ, సింగారెడ్డి డ్రెయిన్ కాలువల దుస్థితి ఘోరంగా ఉందని, ప్రభుత్వంతో చర్చించి వాటి బాగుకు కృషి చేస్తామని అన్నారు.


కన్నీటి నివాళి

అక్కా..

మహోన్నత మానవత్వం మీది
సమోన్నత వ్యక్తిత్వం మీది
ఆదుకునే మనస్తత్వం మీది
స్పందించే సేవాతత్వం మీది

భావితరాలకు స్ఫూర్తి మీరు
ప్రేమానురాగాల దీప్తి మీరు
ఆదరించే అనురాగ మూర్తి మీరు
మాగుంట కుటుంబానికి కీర్తి మీరు

మీ మోములో ఆత్మీయత పంచే అమ్మతనం
మీ కళ్లలో కరుణామయమైన కమ్మదనం
మీ మాటలలో తేనెలొలికే తియ్యదనం
మాకెంతో ఆదర్శం మీ మంచితనం

అనీలయ్యా...

అని పిలిచే మీ పిలుపు
ఇక వినపడదంటే నమ్మలేకున్నాను.
దైవానికి ప్రతిరూపంలా కనిపించే మీ రూపం
ఇక కనపడదంటే తట్టుకోలేకున్నాను.
ఎన్నో జన్మల బంధంలా
నలభై ఏళ్లుగా మీతో పెనవేసుకున్న
ఆత్మీయ అనుబంధాన్ని స్మరించుకుంటూ...

అశ్రునయనాలతో...

మీ..
అనిల్





మాగుంట పార్వతమ్మ గారు
1947 2024

లాయర్
సెప్టెంబర్ 27, 2024

# యువతను కాల్చుకుతింటున్న..నిరుద్యోగ భూతం

మనదేశం అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో మూడవదిగా తయారవుతోందని ఒకవైపు జనం సంబరపడిపోతున్నా, మరోవైపు జడలువిరబోసుకుని వీరవిహారం చేస్తున్న నిరుద్యోగ భూతాన్ని చూసి హడలిపోతున్నారు. దేశం ఒకవైపు అభివృద్ధి చెందుతున్నా, ఇంకా అసమానతలు, పేదరికం వంటివి తగ్గక పోవడం నిజంగానే విచారకరం. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కోట్లాదిమంది యువతీ యువకులు నిరాశా నిస్పృహలతో కుంగిపోతున్నారు. తమను పెంచి పెద్దచేసి, బాగా చదివించిన తల్లితండ్రులను, కుటుంబాలను పోషించుకోలేని దయనీయ స్థితిలో యువత అల్లాడిపోతూనే ఉంది. గత కొంతకాలంగా ప్రభుత్వాలు, పాలకులు చెప్తున్న మాటలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూస్తే ఈ దేశంలో త్వరలోనే నిరుద్యోగం మటుమాయమవుతుందని అందరూ భావించారు. కానీ, ఏళ్ళు గడిచిపోతున్నా నిరుద్యోగం అంతకంతకూ పెరిగిపోతూనే ఉంది. తాజాగా ఈ ఏడాది జులైలో నిరుద్యోగం రేటు 7.90 శాతం నుండి ఆగస్టు నాటికి 8.50 శాతానికి పెరిగిందే తప్ప తరగడం లేదు. 2018 నుంచి 2024 వరకు చూసినా, సగటున నిరుద్యోగం రేటు 8.17 శాతానికి చేరుకుందని నిపుణుల అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి ఒక దేశం ఆర్థిక వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో తెలుసుకోవాలంటే నిరుద్యోగం పరిస్థితి ఎలా ఉందన్నది ముఖ్యం. కానీ, మనదేశంలో నిరుద్యోగం ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. సరైన ప్రణాళికలు అమలుచేయకపోవడం, ఉద్యోగాల కల్పన దిశగా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోకపోవడం వంటివి ప్రభుత్వాల తప్పిదాలే. ఒకవైపు పెరిగిపోతున్న ధరలు సామాన్య ప్రజానీకాన్ని బెంబేలెత్తిస్తుంటే, మరోవైపు నిరుద్యోగభూతం పేద-మధ్యతరగతి యువతను సమస్యల కొలిమిలో వేసి కాల్చుకుతింటోంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉద్యోగావకాశాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం మరొక దౌర్భాగ్యం. పరిశ్రమలు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల వంటివి విరివిగా లేకపోవడం, ఉద్యోగాల ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీచేయకుండా ఏళ్ళ తరబడి కాలయాపన చేయడం, కీలకమైన పోస్టులను కూడా ఖాళీగా పెట్టి సంబంధిత వ్యవస్థలను చేజేతులా నీరుగార్చడం వంటివి దేశంలో సహజమైన పరిణామాలుగా మారిపోయాయి. దీంతో, నెలసరి అత్యల్ప జీతం ఇచ్చే ఉద్యోగాలకు కూడా పెద్దసంఖ్యలో చదువుకున్న నిరుద్యోగులు క్యూలలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఏ కంపెనీలోనైనా ఉద్యోగాలు ఉన్నాయంటే అక్కడికి పరుగులు పెడుతున్నారు. ఒక్కోసారి ఆ క్యూలల్లో తొక్కిసలాటలు కూడా జరుగుతున్నాయంటే దేశంలో నిరుద్యోగ రాకాసి ఎంతగా విజృంభిస్తోందో అర్ధం చేసుకోవచ్చు. ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడమే గగనమైపోయింది. కాంట్రాక్ట్ ఉద్యోగాలైనా సరే, ఏదోఒకటి... బతికుంటే బలుసాకు తినవచ్చని అనుకుంటున్నారు. ఇటీవల కర్నాటక, హర్యానాల్లో ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ రాగానే నిరుద్యోగులు వెల్లువెత్తారు. 'హర్యానా కౌశల్ రోజ్‌గార్ నిగమ్' కింద రోడ్లు ఊడ్వడం, చెత్త తొలగించడం వంటి శానిటేషన్ వర్కర్ పోస్టులకు కూడా వేలాదిమంది తరలివచ్చారు. అలాంటి అతి చిన్న పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నవారిలో 39,990 మంది గ్రాడ్యుయేట్లు, 6112 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు కూడా ఉన్నారంటే.. మన దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్రస్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. కర్నాటక అటవీశాఖలో ఖాళీగా ఉన్న 310 ఫారెస్టు గార్డుల ఉద్యోగాల కోసం అక్షరాలా..లక్షా తొంభైనాలుగు వేలా ఏడు మంది దరఖాస్తులు చేసుకున్నారంటే..నిరుద్యోగ భారతం ఎంత ఘోరంగా ఉందో.. ఇంతకన్నా నిదర్శనాలేమి కావాలీ?.. దేశమంతా ఇదే పరిస్థితి.

ఈ దుస్థితులన్నీ ఇకనైనా సమసిపోవాలి. నిరుద్యోగాన్ని నివారించడానికి ప్రభుత్వాల పరంగా, ప్రైవేటు యాజమాన్యాల పరంగా ఉద్యోగాల కల్పనకు భారీస్థాయిలో కృషిచేయాలి. పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు సామాన్యులు పడుతున్న బాధలను గమనించి, పేదలకు ఉపాధినిచ్చి ఆదుకోవాలి. కార్మికులకు కష్టజీవులకు జీవనోపాధికి మార్గాలు చూపాలి. ఎంతో వ్యయప్రయాసలతో కష్టపడి చదువుకున్న నిరుద్యోగులకు.. వారి ఆకాంక్షలకు తగ్గట్టుగా సముచితమైన ఉద్యోగాలిచ్చి వారి జీవితాలను కష్టాల నుంచి గట్టెక్కించాలి. దేశంలో ఖాళీగా ఉన్న లక్షలు, కోట్లాది పోస్టులను ఇకనైనా భర్తీ చేయాలి. అన్ని రాష్ట్రాల్లో, అన్ని ప్రాంతాల్లో పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని తరిమికొట్టేందుకు యుద్ధప్రాతిపదికన ఉద్యోగ కల్పనలకు కంకణం కట్టుకోవాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించి చిత్తశుద్ధితో అమలు చేయాలి. తద్వారా..'సుసంపన్నమైన భారత్' సాకారానికి ప్రభుత్వాలు మేలుబాటలు వేయాలి.

# టీటీడీ అంటేనే.. అవినీతి మయం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

దుష్ట రాజకీయ శక్తులు తమ అవినీతి సంపాదన కోసం కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండలవాడిని కూడా వదలడం లేదు. ఈ పరంపర ఇప్పుడేదో కొత్తగా గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాం నుండి మొదలయ్యిందంటే అతిశయోక్తే.

స్వామివారిని అడ్డం పెట్టుకుని ఒక్క రాజకీయ నాయకులే కాదు, బడా పారిశ్రామికవేత్తలు కూడా అనాదిగా తమ పబ్బం గడుపుకున్నారు, గడుపుకుంటున్నారు కూడా. తిరుమల తిరుపతి దేవస్థానాలలో అడుగడుగునా అవినీతి తాండవిస్తుంటుంది. సాధారణ అటెండర్ స్థాయి దగ్గర నుండి ప్రభుత్వం నియమించే అధికారులు, ట్రస్టుబోర్డు ఛైర్మెన్లు, సభ్యులు తాము కొండపై అడుగుపెట్టిన క్షణం నుండి ఎక్కడ చిల్లర దొరుకుతుందా అన్నదానిపైనే దృష్టిపెడతారు. స్వామివారి సేవచేసుకునే అదృష్టం లభించిందన్న భక్తిభావంతో అక్కడికి వెళ్లేవారు ఏ కొద్దిమందో ఉంటారు. పీ.వీ.ఆర్.కే.ప్రసాద్, పి.బాలసుబ్రహ్మణ్యం లాంటి అధికారులు, కనుమూరి బాపిరాజు లాంటి ఛైర్మెన్లు అరుదుగా కనిపిస్తారు. డీకే.ఆదికేశవులనాయుడు, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, చదలవాడ కృష్ణమూర్తి, భూమన కరుణాకరరెడ్డి, వై.వీ.సుబ్బారెడ్డి లాంటి వాళ్లంతా రాజకీయ వ్యాపార రంగాలకి చెందినవారే. స్వామివారి పేరుతో వీళ్ళంతా స్వప్రయోజనాల కోసం తపించినవారే. తిరుమలలో పదవి లభించడమంటేనే లడ్డులా భావించే ఇలాంటి వాళ్లకి కల్తీ నెయ్యితో లడ్డు చేస్తున్నారన్నది పెద్ద విషయం కాదు. లడ్డు వ్యవహారం వెలుగులోకి రాగానే మాజీ సీఎం జగన్ హడావుడిగా మీడియా సమావేశం పెట్టి తన బాబాయ్ భక్తితత్త్వం గురించి, కరుణాకర రెడ్డి సచ్ఛీలత గురించీ మాట్లాడారు. వారిద్దరి హయాంలో చక్రం తిప్పిన ధర్మారెడ్డి గురించి ఒక్క ముక్క కూడా చెప్పలేదు. ధర్మారెడ్డి గురించి మాట్లాడడానికి జగన్ మోహన్‌రెడ్డి ధైర్యం చేయలేకపోయినట్లుంది. వాళ్ళిద్దరిమధ్య ఏ రహస్యాలు దాగున్నాయో ఆ శ్రీవారికే తెలియాలి. తిరుమల విషయానికొస్తే.. అందరూ దొంగలే...!

యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# జమిలి ఆలోచన మంచిదే!

నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'జమిలి' ఆలోచన ఓ విధంగా మంచిదే. ప్రతిఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరగడం, ఆ ఎన్నికలు పలానా వారి పాలనకి రెఫరెండం అని పార్టీలు సవాళ్లు విసురుకోవడం వంటి ఆనవాయితీకి తెరపడుతుంది. అంతేకాకుండా అయిదేళ్లపాటు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపైన దృష్టిపెట్టడానికి ఆయా ప్రభుత్వాలకి, పార్టీలకి సమయం లభిస్తుంది. దేశమంతా పార్లమెంటుకి, అసెంబ్లీలకి ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల ఎన్నికల నిర్వహణ ఖర్చు కూడా తగ్గే అవకాశం ఉంది. ఈ జమిలి విధానం పట్ల బీజేపీ అంతర్గతవ్యూహం ఏదైనా, ఆలోచన మాత్రం అమోఘం. ఆచరణ సాధ్యమై అమలులోకివస్తే అదో అద్భుతం!

ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్, హైదరాబాదు.




## జగమంత కుటుంబంలో
# ఒంటరవుతున్న జగన్..!

కుటుంబ విలువలకి, రక్త సంబంధానికి, ఆత్మీయ అనుబంధానికి, స్నేహ బంధానికి, మానవ సంబంధాలకి అత్యంత విలువిచ్చే మహోన్నత వ్యక్తి, మానవీయ మనసున్న సమోన్నత శక్తి స్వర్గీయ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి.

రాజకీయం వేరు, కుటుంబం వేరు అన్నట్లుగా చూసేవారు రాజశేఖర రెడ్డి. అలాగే, స్నేహబంధాలు వేరు.. రాజకీయ సంబంధాలు వేరన్నట్లుగా కూడా వ్యవహరించేవారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రాజశేఖరరెడ్డి కోసం ప్రాణాలివ్వడానికైనా సిద్ధపడే రాజకీయాలతో పూర్తిగా సంబంధం లేని వ్యక్తులు ఆయనకి రాష్ట్రమంతా ప్రతి జిల్లాలో ఉండేవారు. వాళ్లంతా నిస్వార్ధంగా రాజశేఖరరెడ్డి కోసం పనిచేసేవారు. ఆయన అభ్యున్నతికి కాంక్షించేవారు. ఆయన ముఖ్యమంత్రి అయితే చూడాలని ఆరాటపడేవారు.

అంతే తప్ప, ఆయన సీఎం అయితే తమకేదో పదవులు కావాలనో, ఆయన వల్ల తామేదో రాజకీయ లబ్ధి పొందాలనో అనుకునేవాళ్లు కాదు. వారంతా రాజశేఖరరెడ్డిని ఓ రాజకీయ నాయకుడిగా కాకుండా, తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిజాయితీగా పోరాడే నిఖార్సైన వ్యక్తిగా అభిమానించేవారు. ఆయన కోసం తెరవెనుక శ్రమించేవారు, ప్రజాక్షేత్రంలో ఆయన విజయం కోసం తపించేవారు.

### నాన్నకి భిన్నంగా... రాజకీయాలలో విభిన్నంగా!

నాన్న రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి... వ్యక్తిత్వంలో, గుణగణాలలో మాత్రం తండ్రిని మరిపించలేకపోతున్నారు. కన్నతల్లి, తోడబుట్టిన చెల్లితో సహా తన బంధుమిత్ర సపరివారం మొత్తాన్ని ఒక్కొక్కరుగా దూరం చేసుకుంటున్నారు.

ఎలాంటి లాభాపేక్ష, పదవీ కాంక్ష లేకుండా రాజకీయాలకి, రాజకీయ పదవులకి సంబంధం లేకుండా నిస్వార్ధంగా తనకోసం పనిచేసే వాళ్లని జగన్ దరిచేర్చుకోలేక పోతున్నారు. కష్టాలలో, సుఖాలలో తన పక్కనే నిలబడి, తన కోసం ప్రాణాలైనా ఇచ్చేలా తనని అభిమానించ గలిగే ఓ పదిమందిని కూడా జగన్ తన సొంతం చేసుకోలేకపోతున్నారు.

రాజశేఖరరెడ్డి ఆకస్మిక నిష్క్రమణ తరువాత జగన్ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని ఆయన అమ్మ, చెల్లి సమర్ధించారు. ఆయన చేసిన ప్రతి ప్రతిపాదనని వాళ్లిద్దరూ స్వాగతించారు. క్లిష్ట సమయంలో జగన్‌కి తోడుగా నిలిచి, నీకు మేమున్నాం అన్న భరోసాని, ధైర్యాన్ని కల్పించారు.

విజయమ్మ గౌరవాధ్యక్షురాలిగా జగన్ తన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించి, ప్రజలకి, వైఎస్ అభిమానులకి సానుకూల సందేశాన్నిచ్చారు. ఇది రాజశేఖరరెడ్డి కుటుంబ పార్టీ అనే భావన కల్పించారు.

పదేళ్ల పోరాటం తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్ రెడ్డి పంథా మారిపోయింది. తల్లి విజయమ్మ పార్టీకి రాజీనామా చేసి రాజకీయాల నుండి నిష్క్రమించింది. అన్న కోసం వేల కిలోమీటర్లు నడిచిన చెల్లి షర్మిల అన్నకి భారమయ్యింది.

సరిగ్గా 2019 ఎన్నికలకి రెండు నెలల ముందు జరిగిన జగన్ బాబాయ్ వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య మిస్టరీగానే మిగిలిపోయింది. అందుకు కారణం జగనే అన్న ఆరోపణతో బాబాయ్ కుటుంబం కూడా జగన్‌కి దూరమయ్యింది.

అధికారంలో వున్న ఐదేళ్లలో ఓవైపు అమ్మకి, మరోవైపు చెల్లికి, ఇంకొకవైపు బాబాయ్ కుటుంబానికి దూరమవుతూ వచ్చారు. ఎన్నికల సమయానికి ఒకరినొకరు బహిరంగంగా విమర్శించుకునే స్థాయికి పగలూ ప్రతీకారాలు పెంచుకున్నారు. రాజకీయాల పుణ్యమా అంటూ.. ఇంటి గుట్టుని రచ్చకీడ్చుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల వద్ద పరువు తీసుకున్నారు.

తప్పెవరిది..? ఒప్పెవరిది...? అన్న విషయం పక్కనపెడితే రాజశేఖరరెడ్డి కుటుంబం ఇలా రచ్చకెక్కడం ఆయన అభిమానులని కలచివేసింది.

పార్టీలో సైతం 2024 ఎన్నికల ముందు జగన్ చాలామందిని దూరం చేసుకున్నారు. రాజశేఖరరెడ్డిపై అభిమానంతో, ఆ కుటుంబంపై గౌరవంతో జగన్‌కి బాసటగా నిలచిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి లాంటి వ్యక్తిని జగన్ దూరం చేసుకోవడం, రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీకి నష్టం చేసిందన్నది చాలామంది అభిప్రాయం. ఒంగోలులో మాగుంట శ్రీనివాసులరెడ్డి, నరసారావుపేటలో లావు కృష్ణదేవరాయులు, మచిలీపట్టణంలో బాలశౌరి లాంటి వాళ్లని అవమానించి పార్టీ నుండి బయటకి పంపడం కూడా జగన్‌కి భారీ నష్టం చేసిందన్నది నేటికీ వినపడుతున్న మాట.

తాజాగా 2024లో ఎన్నికలు ముగిసి జగన్ అధికారం కోల్పోయాక ఆయన తనవాళ్ళు అనుకుంటున్న నేతలు కూడా ఒక్కొక్కరుగా జారుకుంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కోసం జైలుకి సైతం వెళ్లిన మోపిదేవి వెంకటరమణ తన రాజ్యసభ సభ్యత్వానికి సైతం రాజీనామా చేసేశారు. 'జగన్ నీకో దణ్ణం..' అంటూ పార్టీ నుండి బయటకి వచ్చేశారు. ప్రకాశం జిల్లా రాజకీయాలలో కీలక వ్యక్తిగా వున్న బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. పవన్ కళ్యాణ్‌తో భేటీ అయ్యి, ఆయన త్వరలో జనసేనలో చేరబోతున్నట్లు కూడా ప్రకటించారు. బాలినేని బాటలో మరికొంతమంది నడవబోతున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఆంధ్రాలో బీసీ నాయకులకి గతి లేదన్నట్లుగా పక్క రాష్ట్రంనుండి బీసీ నేత ఆర్.కృష్ణయ్యని పట్టుకొచ్చి రెండేళ్ల నాడు రాజ్యసభ సభ్యత్వాన్ని కట్టబెట్టారు జగన్. ఇప్పుడు ఆయన కూడా 'అయ్యా నీకో నమస్కారం' అంటూ రాజ్యసభకి రాజీనామాచేసి, బీజేపీ కండువా కప్పుకోబోతున్నారు.

ఇంత జరుగుతున్నా జగన్‌లో మార్పు రావడంలేదు.

"మీ పార్టీలో సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నారట కదా...?" అని ఒక విలేఖరి అడిగిన ప్రశ్నకి జగన్ వ్యంగ్యంగా ప్రతిస్పందిస్తూ "ఎవరు బోతావున్నారబ్బా!.. యా సీనియర్ లీడర్ బోతావుండాడు.. ఏమౌతాంది.. పోనీలే ఏమైతది.. ఇంకోరొస్తారు" అని మాట్లాడడం ఆయన నైజాన్ని, మారని ధోరణిని ప్రస్ఫుటం చేస్తుంది.

మహానేత మరణంతో అప్పటివరకు ఆయనకి అండగా నిలచిన జగమంత కుటుంబం జగన్‌కి తోడుగా నిలచింది. జగన్‌మోహన్‌రెడ్డిలో రాజశేఖరరెడ్డిని చూసుకుని మురిసిపోయింది. తీరా అధికారం వచ్చాక జగన్ తీరుచూసి ఆ కుటుంబం మొత్తం మారిపోయింది. అటు రాజకీయాలలోనూ, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ అందరినీ దూరం చేసుకుంటూ....

**"జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది"**

**"సంసార సాగరం నాదే.. సన్యాసం శూన్యం నాదే"**... అని 'చక్రం' సినిమాలో ప్రభాస్ పాడుకున్న పాట ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలలో జగన్ కూడా పాడుకోవలసి వస్తుందన్న మాట సర్వత్రా వినిపిస్తోంది!

\- రాజశ్రీ

# కన్నుమూసిన ఆపన్నుల అమ్మ!...
# దివికేగిన మాగుంట పార్వతమ్మ



(మొదటిపేజీ తరువాయి)

ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. దిగులుతో మంచం పట్టారు. అన్నపానీయాలు ముట్టనని పంతం పట్టారు. చివరికి మృత్యువు బాట పట్టారు. పార్వతమ్మ మరణంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాగుంట కుటుంబ అభిమానుల మనసులు బోరున రోదిస్తున్నాయి.

## బెజవాడ కుటుంబం నుండి మాగుంట కుటుంబంలోకి!

బెజవాడ రామిరెడ్డి – భూదేవమ్మ దంపతులకు 1947 జులై27న జన్మించింది పార్వతమ్మ. 1967 ఫిబ్రవరి 19న మాగుంట రాఘవరెడ్డి, కౌసల్యమ్మల పెద్దకుమారుడు మాగుంట సుబ్బరామరెడ్డిని పెళ్లాడి మాగుంట వారి కోడలయ్యింది ఈ బెజవాడ ఆడపడుచు.

1968లో ఆమెకు కుమార్తె మాలిని పుట్టింది. 1969లో కుమారుడు విజయ్‌రెడ్డి జన్మించాడు. రాఘవరెడ్డికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వారిది ఉమ్మడి కుటుంబం. రాఘవరెడ్డి తరువాత ఆ కుటుంబానికి సుబ్బరామరెడ్డే పెద్దదిక్కుగా మారాడు. ఇంటి పెద్ద కోడలిగా పార్వతమ్మ అడుగుపెట్టినప్పటి నుండి ఆ కుటుంబానికి బాగా కలిసొచ్చింది.

పార్వతమ్మ పెళ్లైన తొలి దశాబ్దంలోనే కృష్ణ, కావేరి, కళ్యాణి సినిమాహాళ్ళు ప్రారంభించిన తరువాత మూడుహాలోళ్ళుగా మాగుంటోళ్ళ పేరు రాష్ట్రమంతా మారుమ్రోగిపోయింది. 1990 నాటికి మాగుంట పేరు ముఖ్యంగా సుబ్బరామరెడ్డి పేరు దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. సుబ్బరామన్న సతీమణిగా పార్వతమ్మ ఆ ఇంటికి మహారాణి. అటు కుటుంబంలోనూ, ఇటు సుబ్బరామన్న అభిమానుల హృదయాలలో సైతం ఆమె దేవతగా కొలువయ్యారు.

సుబ్బరామరెడ్డి రాజకీయాలలోకి వస్తానని ఏరోజూ అనుకోలేదు. ఆయన సమాజసేవకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కుడి చేత్తో ఇచ్చిన దానాన్ని ఎడమ చేతికి కూడా తెలియనిచ్చేవారు కాదు. ఆయన చేసిన ప్రజాపయోగ కార్యక్రమాలూ, దానధర్మాలతో రాజకీయ అరంగేట్రం చేయకముందే ఆయన ప్రజలలో దేవుడైపోయాడు.

రాజీవ్‌గాంధీ ఆశీస్సులతో 1991లో అనూహ్యంగా రాజకీయ రంగప్రవేశం చేసిన సుబ్బరామరెడ్డి, అనతికాలంలోనే ప్రజల హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్నారు. అయితే, అనుకోకుండా జరిగిన విషాద సంఘటనతో దుర్మార్గులు డిసెంబర్ 1, 1995న ఆయనను పొట్టన పెట్టుకున్నారు.

భర్తతో పాటు నిత్యం ప్రజలలో మమేకమై, ఆయన చేసే సేవా కార్యక్రమాలలో పాలుపంచుకునేవారు పార్వతమ్మ. అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో సైతం ఆమె ముఖ్యపాత్ర పోషించేవారు. ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గం ప్రజలలో సుబ్బరామన్న తండ్రి అయితే, పార్వతమ్మ తల్లిలా అందరి ఆదరణ పొందారు. అయితే, తనకు ఇలాంటి పరిస్థితి వస్తుందని ఆమె కలలో కూడా వూహించలేదు. ఊహించని పరిణామాలతో రాజకీయ ప్రవేశం చేయవలసి వచ్చింది.

పార్వతమ్మకు రాజకీయానుభవం తక్కువ. ప్రజాభిమానం ఎక్కువ. మాగుంట సుబ్బరామరెడ్డి దివంగతులైన తరువాత 1996లో తొలిసారిగా ఆమె ప్రత్యక్ష రాజకీయాలలో అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లాలో తన భర్త సుబ్బరామరెడ్డి వెలిగించిన ఆశయజ్యోతిని దేదీప్యమానంగా ప్రకాశింప చేయాలన్న లక్ష్యంతో రాజకీయ ప్రవేశానికి సమ్మతించారు.

తన పెదనాన్న బెజవాడ గోపాలరెడ్డి ఆశీర్వాదంతో భర్త ఆశయాలను కొనసాగించడానికి 1996 లోక్‌సభ ఎన్నికలలో ఒంగోలు నుండి పోటీ చేశారు. మాగుంట సుబ్బరామరెడ్డి ఎంపీగా నాలుగేళ్ళపాటే పనిచేసినా నాలుగు తరాలకు సరిపడా ప్రజాభిమానాన్ని సంపాదించుకున్నారు. ఆ అభిమానమే 1996 ఎన్నికలలో పార్వతమ్మను విజయపంథాన నడిపింది. సమీప ప్రత్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై 50వేలకు పైగా మెజార్టీతో ఆమె గెలిచారు. సుబ్బరామన్న ఆశయాలకు జీవం పోశారు. నియోజకవర్గ పరిధిలో సుబ్బరామరెడ్డి నెలకొల్పిన విద్యాసంస్థలు, వైద్య సంస్థలు, మంచినీటి పథకాలు... ఇలా ఏవి కూడా ఆగిపోకుండా పార్వతమ్మ చర్యలు తీసుకున్నారు. ఒంగోలు జనానికి సుబ్బరామరెడ్డి లేని లోటును ఎక్కడా కనబడనీయకుండా ఆమె పనిచేశారు.

కానీ రెండేళ్ళలోపే(18 నెలలకి) 1998లో మళ్ళీ లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలొచ్చాయి. తన మరిదిని ప్రకాశం జిల్లాకు పరిచయం చేయాలనే పార్వతమ్మ ఆకాంక్షతో ఆ ఎన్నికలలో అమెకు బదులుగా మాగుంట శ్రీనివాసులురెడ్డి అభ్యర్థిగా బరిలోకి దిగారు. పార్వతమ్మ తాను పోటీ చేసినట్లుగానే భావించి లోక్‌సభ పరిధి అంతటా ప్రచారం చేశారు. శీనయ్యని అఖండ మెజారిటీతో గెలిపించారు. ఆ తరువాత ఆరేళ్ళపాటు ఆమె రాజకీయాలకి దూరంగా ప్రజాసేవకే పరిమితమయ్యారు.

## పార్లమెంటు నుండి అసెంబ్లీకి!

అయితే, మళ్ళీ 2004లో ఆమెను రాజకీయ తెరపైకి తీసుకువచ్చారు. అప్పట్లో ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గంలో వుండిన కావలి అసెంబ్లీ నుండి ఆమెను బరిలోకి దించారు. తద్వారా ఒంగోలు పార్లమెంటుకు పోటీచేసిన ఆమె మరిది శీనయ్యకు కూడా లబ్ధి చేకూరాలన్నది దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆలోచన. ఆ ప్రయత్నం ఫలించింది. ఓ వైపు అన్న, వదినల సెంటిమెంటుతో పాటు మరోవైపు డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంతో ఇద్దరూ గెలిచారు. పార్వతమ్మ శాసనసభ్యురాలయ్యారు.



సహజంగానే సేవాగుణం మెండుగా వుండే ఆమె తనదైన తరహాలో కావలి నియోజకవర్గ ప్రజల మనసులని గెలుచుకున్నారు. ఎప్పటికీ ఆమే తమకు శాసనసభ్యురాలిగా ఉండాలనే స్థాయిలో అక్కడి వారి మనసులలో ఆమె చెరగని ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా కావలి నియోజకవర్గంలో పరిష్కారం కాకుండా మూలనపడి వుండిన అనేక సమస్యలను ఆమె వై.యస్ దృష్టికి తెచ్చి, కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పెట్టారు. కావలి పట్టణాన్ని కూడా అభివృద్ధి చేసి తనదైన మార్కును వేసుకున్నారు. కానీ, 2009 ఎన్నికలలో మళ్ళీ ఆమె రాజకీయాలకి దూరం జరిగారు. కారణం ఏదైనా పార్వతమ్మకు టిక్కెట్ రాలేదు. మళ్ళీ 2012లో మాత్రం ఒంగోలు నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థిగా సుబ్బరామయ్య శిష్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డిపై శాసనసభకు పోటీచేసి పరాజయం పొందారు. అక్కడితో ఆమె రాజకీయ ప్రస్థానానికి, ప్రత్యక్ష ప్రజా జీవితానికి తెరపడింది.

కానీ, ఆమె చివరిశ్వాస వరకూ సేవా రంగంలో తన ఉనికిని చాటుతూనే ఉన్నారు. తన వద్దకు ఎవరు ఏ అవసరంతో వచ్చినా ఆదుకుంటూనే వున్నారు. సుబ్బరామరెడ్డి భార్యగా, మాగుంట వారి కోడలుగా మాగుంట ప్రతిష్ట ఎక్కడా తగ్గకుండా తన శక్తిమేరకు సేవలు అందిస్తూనే వచ్చారు. తాను ప్రత్యక్షంగా ప్రజాజీవితంలో లేకపోయినా పరోక్షంగా ప్రజల హృదయాలలో చెరగని ముద్రను వేసుకున్నారు.

భార్యగా, అమ్మగా, అత్తగా, అమ్మమ్మగా, నానమ్మగా, తోడికోడలుగా, వదినగా తన బాధ్యతలని త్రికరణశుద్ధిగా నిర్వహించి, తన కుటుంబాన్ని, అభిమానులని ఆప్తులని, ఆత్మీయులని విడిచి తిరిగిరాని లోకాలకి తరలి వెళ్లిపోయారు పార్వతమ్మ.

సెప్టెంబర్ 25వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2గంటలకి ఆమె పార్థివదేహం నెల్లూరు, సరస్వతినగర్‌లోని వారి స్వగృహానికి చేరుకుంది. 26వ తేదీ గురువారం సాయంత్రం ఆమె అంత్యక్రియలు జరిగే వరకూ విశేషరీతిలో తరలివచ్చిన అశేష మాగుంట కుటుంబ అభిమానులు ఆమెకి నివాళులు అర్పిస్తూనే ఉన్నారు. వారితో పాటు పలువురు రాజకీయ, పారిశ్రామిక, వ్యాపార ప్రముఖులు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ఇతర అనేక రంగాల ముఖ్యులు, మాగుంట సంస్థల సిబ్బంది.. ఆమెకి కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

ఇంటి పెద్దని కోల్పోయి శోకసముద్రంలో ఉన్న మాగుంట కుటుంబ సభ్యులకి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుకుంటూ, పార్వతమ్మ ఆత్మకి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తోంది 'లాయర్'!

## ఆదర్శమూర్తి..పార్వతమ్మ
### - సంతాప సందేశంలో వెంకయ్య

ఒంగోలు పూర్వ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి మాగుంట పార్వతమ్మ పరమపదించారని తెలిసి ఎంతో విచారించానని, ఆమె వ్యక్తిత్వం..దాతృత్వం ఉన్నతమైనవని, మహిళామూర్తులకు ఆమె ఆదర్శమూర్తి అని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. పార్వతమ్మ భర్త, ఒంగోలు పూర్వ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి కాలం నుంచి వారి కుటుంబం తనకు బాగా సుపరిచితమన్నారు. వారు తన పట్ల ఎంతో గౌరవాభిమానాలు చూపేవారని, వారి కుటుంబ దాతృత్వం తనెంతగానో ఆకట్టుకునేదని, పేదసాదలకు సాయం చేసే వారి మంచి గుణమే వారి పట్ల గౌరవాన్ని మరింత పెంచిందని తెలిపారు. ఆమె పరమపదించారని తెలియగానే, మాగుంట శ్రీనివాసులురెడ్డికి ఫోన్‌చేసి సంతాపాన్ని తెలియజేశానని, మాగుంట పార్వతమ్మ గారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు.





## ముఖ్యమంత్రి సంతాపం :

మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతిచెందడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఫోన్ ద్వారా పరామర్శించారు. మాగుంట సుబ్బరామిరెడ్డి మనుమడు మాగుంట సుబ్బరామ్‌తో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు.

## ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు!



మాగుంట పార్వతమ్మ భౌతికదేహానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సహజంగా మాజీ పార్లమెంటు సభ్యులకి, శాసనసభ్యులకి ప్రభుత్వ లాంఛనాలు వర్తించవు. అయితే, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్వతమ్మకి ప్రత్యేక గుర్తింపుని ఇచ్చారు. పార్వతమ్మ చేసిన సామాజిక సేవకి గుర్తుగా ఆమెకి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలని జరపాలని అధికారులని ఆదేశించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున విద్యుత్ వనరుల శాఖామాత్యులు గొట్టిపాటి రవికుమార్ పార్వతమ్మ అంత్యక్రియలలో పాల్గొని నివాళులు అర్పించి, ప్రభుత్వ లాంఛనాలని పర్యవేక్షించారు.

# నెల్లూరు కబుర్లు

## పెద్దాసుపత్రిలో కలెక్టర్ సమావేశం



రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి వైద్యులు, అధికారులు అందరూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో బయో మెడికల్ వ్యర్థాల సేకరణకు ప్రైవేట్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని, నెల్లూరు మున్సిపాలిటీ వాళ్ళు సేకరించే సాధారణ చెత్తతో ఈ బయో వ్యర్థాలు కలవకుండా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం ఐసిఐసి బ్యాంక్ వారు సిఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన బ్లడ్ కాంపోనెంట్ సపరేటర్ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. 25 లక్షలు విలువైన బ్లడ్ కాంపోనెంట్ సపరేటర్(సెంట్రిఫ్యూజ్) యూనిట్‌కి సంబంధించిన పరికరాలను ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంకుకు అందజేయడం పట్ల ఐసిఐసి బ్యాంకు వారిని కలెక్టర్ అభినందించారు. ఆ బ్యాంక్ ప్రతినిధులు హరీష్, రాంజీ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అపోలో ఆసుపత్రిలో..

## అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్



నెల్లూరులోని అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇటీవల ఫైజర్ సంస్థ ప్రతినిధులతో కలసి ఆసుపత్రి నిర్వాహకులు అడల్ట్ వ్యాక్సినేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ, న్యూమోకోకల్, ఇన్‌ఫ్లుయింజా, హ్యూమన్ పాపిల్లోమా వైరస్, హెపటైటిస్ ఏ-బీతో పాటు, టీకా ద్వారా నివారించగల అన్ని రకాల వ్యాధులకు ఇక్కడ టీకాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి (సీఓపీడీ, ఆస్తమా), డయాబెటిస్, గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వగైరాలకు ముందస్తు టీకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీవిత కాల వ్యాక్సినేషన్ అనేది వృద్ధుల జీవిత ప్రమాణాన్ని గణనీయంగా పెంచుతుందని, అందులో పెద్దవారు వ్యాక్సినేషన్ తీసుకోవడానికి వివిధ పద్ధతుల్లో ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఫైజర్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ వ్యాక్సినేషన్ సెంటర్ ద్వారా ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయనున్నామని చెప్పారు. అపోలో వైద్యనిపుణులు డాక్టర్ బిందు మీనన్, డాక్టర్ ఏకే చక్రవర్తి, డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, డాక్టర్ ఏ. దినేష్ రెడ్డి, డాక్టర్ ఎం.సి.ఎస్.రెడ్డి, ఫైజర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## పేద విద్యార్థినికి.. వేమిరెడ్డి సాయం

నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన కొండల రావు కుమార్తె తారకలక్ష్మి భవాని చదువు కోసం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇటీవల 35వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యం చాటుకున్నారు. ఎందరో నిరుపేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్న విపిఆర్ స్కూల్‌లో తారక లక్ష్మి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుని, టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించింది. ఆ పేద విద్యార్థినికి ఉన్నత చదువుల ఖర్చు తనే భరిస్తానని విపిఆర్ హామీ ఇచ్చి ఉన్న నేపథ్యంలో, విపిఆర్ ఆమేరకు ఆర్థిక సహాయం అందించారు.

## శిథిలావస్తలో పాలిటెక్నిక్ భవనాలు

- బాగుచేయించాలని మంత్రి ఆనంకు వినతి



నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఎంతోకాలం నుంచి ఉన్న బాలుర పాలిటెక్నిక్ కళాశాల భవనాలు శిథిలావస్తకు చేరుకున్నాయని, వానలు వరదలు వచ్చినప్పుడు భవనాలు ఉరుస్తున్నాయని, ప్రధాన భవనం కూలిపోయే స్థితిలో ఉందని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని, విద్యార్థులకు మంచి వసతులు కల్పించాలని ఆ కళాశాల పూర్వ విద్యార్థులు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలసి మొరపెట్టుకున్నారు. ఈనెల 23న నెల్లూరులోని మంత్రి నివాసంలో వారు ఆయన్ను కలసి కళాశాల దుస్థితిని వివరించి వినతిపత్రం సమర్పించారు. అందుకు స్పందించిన మంత్రి, ప్రభుత్వంతో సంప్రదించి సమస్యలు తీరుస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డి.ప్రభాకర్‌రావు, కార్యదర్శి డి.శివకుమార్ పాల్గొన్నారు.

## కులగణన వెంటనే చేపట్టాలి

- బీఎస్పీ నేత డా. పూర్ణచంద్రరావు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచిపోతున్నా బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం ఇవ్వకపోవడం దారుణమని, ఇకనైనా వెంటనే కులగణన చేపట్టి బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డా.పూర్ణచంద్రరావు కోరారు. ఇటీవల ఆయన నెల్లూరులో బహు జనసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా దామాషా ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లోనూ, రాజకీయరంగంలోనూ రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. కులగణన చేపట్టాలని కోరుతూ, అక్టోబరు 9న విజయవాడలో పెద్దఎత్తున మహాధర్నా జరుగుతుందన్నారు. బీఎస్పీ ఏపీ అధ్యక్షుడు పరంజ్యోతి, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, నాయకులు ఉదయగిరి నరసింహులుగౌడ్, పలు జిల్లాల బీసీ నాయకులు, బీఎస్పీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల సందడి

### ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



జిల్లా చరిత్రలోనే కనీవిని ఎరుగని విధంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఈసారి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 24న నెల్లూరు దర్గామిట్టలో కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్షించారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పని చేయాలని స్పష్టం చేశారు. అక్టోబరు 3 నుంచి 12వతేదీ వరకు జరగనున్న అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సావాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ ఉత్సవాల పర్యవేక్షణకు18 మందితో కమిటీని వేసి, ఛైర్మెన్‌గా అలహరి విజయ్‌కుమార్‌ను నియమించారు. అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యులందరినీ ఆయన ఘనంగా సన్మానించారు.

## చెస్‌లో..ఆదిత్య వరుణ్ ప్రతిభ




నెల్లూరులో ఇటీవల మూడురోజుల పాటు నిర్వహించిన వైవీ రమణారెడ్డి స్మారక తృతీయ ఆలిండియా ఓపెన్ చెస్‌పోటీల్లో విశాఖపట్నంకు చెందిన ఫిడే చెస్ మాస్టర్ ఆదిత్య వరుణ్ తన సత్తాచాటుకుంటూ ప్రథమస్థానంలో నిలిచాడు. అదేవిధంగా, హైదరాబాద్‌కు చెందిన భరత్ కుమార్‌రెడ్డి ద్వితీయస్థానాన్ని, చెన్నై నివాసి హరిమాధవన్ తృతీయస్థానాన్ని పొందారు. విజేతలకు నిర్వాహకులు రూ 2.25లక్షల నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.సుమన్, టోర్నీ డైరెక్టర్లు ఎస్ వెంకటేష్, మధుసూదన్‌రెడ్డి, వినయ్, ఎస్‌బీ హోమ్స్ ఛైర్మెన్ సుప్పనాచారి, తిరుపతికి చెందిన కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయానికి..లక్ష విరాళం

నెల్లూరు దర్గామిట్టలో వెలసివున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అన్నదాన పథకానికి ఇటీవల దాతలు కరణం దొరబాబు, రాయపనేని విజయకుమార్‌లు చెరో రూ.50వేలను విరాళంగా సమర్పించినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

## సమస్యలు తీర్చాలంటూ ఎస్ఎఫ్ఐ ర్యాలీ

కొత్త ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా విద్యార్థుల సమస్యలు తీరలేదని, ఇకనైనా ప్రభుత్వం విద్యార్థుల కష్టాలు తీర్చాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 23న నెల్లూరు, విఆర్‌సి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. డిగ్రీ విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, హాస్టళ్ళలో మెస్ చార్జీలను పెంచాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చరణ్, సుమన్, ప్రశాంత్, జీవన్, విష్ణు, పవన్, యశ్వంత్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ విరాళం

విజయవాడ వరదబాధితుల సహాయార్థం నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ సభ్యులు 1,01,116 రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని చెక్కురూపంలో ఇటీవల మంత్రి నారాయణకు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.శోభన్ బాబు, కార్యదర్శి ఏ.ఫణీంద్ర, కోశాధికారి బి.సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి సిహెచ్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మ్‌డ్ పోలీసుల సాయం

విజయవాడ వరదబాధితులకు అండగా జిల్లాలోని సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసులు ఈనెల 23న 75వేల రూపాయలను విరాళంగా అందించారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసుల సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆనంద్‌ను కలసి ఆ మొత్తాన్ని చెక్కురూపంలో అందజేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్, సెక్రటరీ పాల్ తిరుపతయ్య, సుబ్బారావు, డీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివిఎస్‌యులో జాబ్ మేళా

- 69 మందికి ఉద్యోగాలు

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ప్రాంగణంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత ఆధ్వర్యంలో ఇటీవల జాబ్‌మేళా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఆర్‌సి ఎకోటెక్స్ ఇండియా ప్రై.లి., హెటెరో ల్యాబ్స్, లూకాస్ టీవీఎస్ లిమిటెడ్, టీసీఎల్, ఆప్టో టెక్నాలజీస్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొని విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాయి. మొత్తం 271 మంది అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించగా, 69మంది అభ్యర్థులు ఎంపికైనట్లు స్కిల్ హబ్ సమన్వయకర్త డాక్టర్ జె.విజేత తెలిపారు.





## వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో..

# టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

### బుచ్చి ఛైర్‌పర్సన్‌తో సహా 7 మంది చేరిక

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సుపరిపాలనకు ప్రభావితులైన వైసీపీ నాయకులు క్రమంగా తెలుగుదేశం పార్టీలోకి వచ్చేస్తున్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం నుంచి కూడా పలువురు కౌన్సిలర్లు, ప్రత్యేకించి బుచ్చి నగర పంచాయతి ఛైర్‌పర్సన్ కూడా వైసీపీకి గుడ్‌బై చెప్పేసి టీడీపీ గూటికి చేరారు. ఇటీవల నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిల నివాసంలో, రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ సమక్షంలో బుచ్చి నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో పాటు, ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. టీడీపీలోకి చేరిన కత్తి నాగరాజు, పఠాన్ నస్రీన్, రాచూరి సత్యం, ప్రసాద్, రహమత్, శ్రీదేవిలకు మంత్రి నారాయణ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోనికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల నిధులు దారి మళ్లించడంతో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజాసేవ చేయాలన్న తపనతో రాజకీయాల్లోకి వచ్చి తమకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వైసీపీ నాయకులు టీడీపీలోకి వస్తున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక బుచ్చి నగర పంచాయతీ అభివృద్ధికి కోటీ 42 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. టీడీపీ పాలనలో బుచ్చి పట్టణాన్ని కనీవినీ ఎరుగని విధంగా అభివృద్ధి చేస్తామని, కొత్తగా టీడీపీలో చేరిన కౌన్సిలర్లు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టీడీపీలో చేరిన మున్సిపల్ ఛైర్మన్‌ను, కౌన్సిలర్లను అభినందించారు.



# 'అజీజ్-అజయ్'లకి సముచిత గుర్తింపు

### ఒకరు 'వక్ఫ్'కి, మరొకరు 'టిడ్కో'కి ఛైర్మెన్లయ్యారు





**తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి ఇంతకాలంగా కష్టపడి సేవలందిస్తున్నవారికి, ప్రత్యేకించి కష్ట కాలాల్లో పార్టీలోనే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషిచేసినవారికి ఇపుడు మంచి పదవులు లభిస్తున్నాయి. దీంతో పార్టీ వర్గాల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. ఈనెల 24న తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో నెల్లూరీయులకు కూడా ప్రాధాన్యత దక్కింది.**

## అజీజ్‌కు మంచి స్థానం :

దీర్ఘకాలంగా పార్టీకి విధేయుడిగా ఉన్న టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ పదవి లభించింది. దీంతో ఆయన సహచరులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. గతంలో ఆయన నెల్లూరు కార్పొరేషన్ మేయర్‌గా ఉన్నారు. ఆ తర్వాత పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆయన్ను టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించారు. 2019లో నెల్లూరు రూరల్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి పరాజయం పాలైనా, రూరల్ టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉంటూ ఆయన పార్టీని పటిష్టం చేశారు. గత ఎన్నికల్లో కారణాంతరాల వల్ల నెల్లూరు రూరల్ అభ్యర్థిత్వం లభించకపోయినా, పార్టీని వీడకుండా రూరల్‌లో టీడీపీ విజయానికి అజీజ్ సహకరించడంతో, పార్టీ అధినేత.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు తాజాగా వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ పదవినిచ్చి గౌరవించారు.

## నిబద్ధతతోనే అజయ్‌కి పదవి :

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సన్నిహితులు.. జనసేన కేంద్ర మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్‌కు 'టిడ్కో' ఛైర్మెన్ పదవి లభించడంతో జనసేన వర్గాల్లో ఆనందాతిరేకాలు వెల్లడవుతున్నాయి. పవన్ అంటే అజయ్‌కి అపారమైన అభిమానం. పవన్ ఆశయాలకు ఆకర్షితుడై, ఆ అభిమానంతోనే ఆయన జనసేన పార్టీలో ఉంటూ, పార్టీ పటిష్టతకు, మొన్నటి ఎన్నికల్లో పార్టీ విజయానికి తనవంతు కృషి చేశారు. అందులోనూ అజయ్ నెల్లూరీయులు. ప్రముఖ న్యాయవాది.. అభ్యుదయవాది.. నీతి నిజాయితీలకి నిలువెత్తు ప్రతీకగా పేరెన్నికగన్న వేములపాటి అనంతరామయ్య కుమారుడే అజయ్. క్రమశిక్షణ-సేవాభావం ఆ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. జనసేన పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్ తన నిస్వార్థ సేవలతో.. నిబద్దత గల నాయకునిగా అందరి గుర్తింపును పొందారు. ఆ నిబద్ధతే ఆయనకు మంచి పదవిని అందించింది. ప్రత్యేకించి జిల్లాలో జనసేన సభ్యత్వ నమోదు ముమ్మరం చేసి స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు ఆయన కృషి చేస్తూనే ఉన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశీస్సులతో ఆయనకు 'టిడ్కో' పదవి రావడంతో, జనసేన నాయకులు కార్యకర్తలు సంతోషిస్తూ, అజయ్‌ను కలసి శుభాకాంక్షలు చెప్పారు.

మొత్తానికి నామినేటెడ్ పదవుల్లో అజీజ్, అజయ్‌లకు ఛైర్మెన్ పదవులు రావడంతో అటు టీడీపీ, ఇటు జనసేన వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# వేడుకగా 'శ్రీసిటీ-రాక్‌వర్త్'.. 13వ వార్షికోత్సవం

### • స్థానికులకు ఉద్యోగాల కల్పన పట్ల శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి హర్షం

కార్యాలయాల్లో ఫర్నిచర్ తయారీకి అగ్రగామి సంస్థగా పేరొందిన శ్రీసిటీలోని రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నీచర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈనెల 19న శ్రీసిటీలో 13వ వార్షికోత్సవాన్ని వేడుకగా జరుపుకుంది. 2011 సెప్టెంబరు 19 న కంపెనీ స్థాపన జరిగి, దశాబ్దం పాటు కంపెనీ బాగా అభివృద్ధి చెంది, నాణ్యతకు మారుపేరుగా నిలిచిందంటూ వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ వేడుకలలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్..సీఇఓ శైలేష్ కుమార్‌సింగ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ రాయన సమక్షంలో శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాక్‌వర్త్ పరిశ్రమ 13వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం శ్రీసిటీ కమ్యూనిటీకి గర్వకారణమన్నారు. నైపుణ్యం, వినియోగదారుల సేవలో అద్వితీయ ప్రతిభతో ముందు కెళుతున్న రాక్‌వర్త్ సంస్థ, భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా కూడా తనదైన ముద్ర వేసిందన్నారు. రాబోయే రోజుల్లో భారత



దేశ పారిశ్రామిక వృద్ధికి రాక్‌వర్త్ కీలక భాగస్వామ్యం అందిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగుల్లో హెచ్‌ఆర్ స్థాయి నుంచి క్రింది స్థాయి వరకు 90 శాతం స్థానికులు ఈ పరిశ్రమలో ఉండడం పట్ల రాక్‌వర్త్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. శైలేష్‌కుమార్ మాట్లాడుతూ, తమ సిబ్బంది అంకిత భావం, కష్టమర్ల నమ్మకం, శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబం సహకారం రాక్‌వర్త్ విజయానికి మూలస్తంభాలని చెప్పారు. వెనుకబడిన ప్రాంతంలో శ్రీసిటీని నెలకొల్పి ఈ ప్రాంత ఆర్థిక సామాజిక ప్రగతికి బాటలు వేసిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి తాము రుణపడి ఉంటామని రాక్‌వర్త్ హెచ్‌ఆర్ మేనేజర్ రమేష్ అన్నారు.

## ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక విద్యా సాయం..

ఈ వేడుకలో భాగంగా 18 మంది కంపెనీల ఉద్యోగుల పిల్లలకు విద్యా సాయం ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. 20 వేల రూపాయల జీతం కంటే తక్కువ జీతం కలిగి వున్న ఉద్యోగుల పిల్లలకు సంబందించిన ప్రైవేట్ స్కూళ్ళు, కళాశాలల ఫీజు పూర్తిగా కంపెనీ చెల్లిస్తుందని నిర్వాహకులు చెప్పారు. ఈ ఏడాది 18 మందికి ఈ సాయం అందించగా, వచ్చే విద్యా సంవత్సరంలో 100 మంది పిల్లలకు దీనిని వర్తింపజేయనున్నట్లు రాక్‌వర్త్ ఎం.డీ శైలేష్‌కుమార్‌సింగ్ ప్రకటించారు. ఈ కంపెనీలో దీర్ఘకాలంగా పనిచేసిన ఉద్యోగులకు, సాంస్కృతిక కళా ప్రదర్శనలలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాక్‌వర్త్ పరిశ్రమ వారు బహుమతులు అందచేశారు.

## సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా..పట్టాభి



జిల్లాకు కేటాయించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు సన్నిహితుడు.. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, నెల్లూరుజిల్లా వాసి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి లభించింది. అదేవిధంగా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు తాళ్ల నరసింహస్వామి పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎంతోకాలంగా తెలుగుదేశం పార్టీనే నమ్ముకునిఉన్న అల్లూరు మాజీ సర్పంచ్ తిరువీధి అనూరాధ, ఏపీ షెడ్యూల్‌ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా పదవిని పొందడం విశేషం!




# జనసేనకు.. 10 లక్షల విరాళం



విజయవాడ వరదబాధితులకు నెల్లూరు జనసేన కోర్‌కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ ఇటీవల మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన అధ్యక్షుడు..ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి 10 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. జనసేన పార్టీ పరిశీలకులు వేములపాటి అజయ్‌కుమార్ సమక్షంలో ఆయన ఆ మొత్తాన్ని పవన్‌కు అందించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, ప్రజాసేవ చేయడాన్ని అదృష్టంగా భావించి జనసేన నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజల కోసం పనిచేయాలని చెప్పారు. నెల్లూరులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపడుతుండడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం పేదల పక్షాన నిలిచి పార్టీకి మంచిపేరు తేవాలని ఆయన కోరారు.

# చంద్రబాబుతోనే సుపరిపాలన

## ● కొనియాడిన మంత్రి నారాయణ



తెలుగుదేశం పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమవుతోందని, వంద రోజుల పాలనలోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతగానో అభిమానించి ఆదరిస్తున్నారని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈనెల 22న ఆయన నెల్లూరు 9వ డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రి నారాయణ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, చెప్పిన మాట ప్రకారం రూ.3000 పింఛన్‌ను రూ.4000లకు పెంచారని, దివ్యాంగులకు ఏకంగా రూ.6000 పెన్షన్ ఇస్తున్నారని చెప్పారు. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న వారి కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 16437 మందికి ఉపాధి కల్పించేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ.1674 కోట్ల నిధులను రైతులకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాగానే రూ. 1452 కోట్లు పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామన్నారు.

# రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు..ఎన్‌బికెఆర్ క్రీడాకారులు



అక్టోబర్ నెల మొదటివారంలో విశాఖపట్నం జిల్లా నునపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న ఎం.కావ్య, ఎన్.కిరణ్మయి, డి.శ్రీనాథ్, జి.నవదీప్‌లు ఈనెల 22న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన ఎంపికల్లో తమ సత్తాచాటుతూ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డా.వి.మల్లికార్జునరెడ్డిలు ఆ విద్యార్థులను అభినందించారు.

## డిఎస్ఆర్ ట్రస్ట్‌లో..

# 29న మెగా ఉచిత వైద్యశిబిరం

అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు (డిఎస్ఆర్ ట్రస్టు) ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.రవికిరణం (షుగర్‌వ్యాధి నిపుణులు), డాక్టర్ కె.బాలకొండయ్య (ఎముకలు–కీళ్ల నిపుణులు), డాక్టర్ అభినయరెడ్డి.వి (న్యూరాలజిస్ట్), డాక్టర్ టీజీ లక్ష్మీదుర్గ (గైనకాలజిస్ట్), డాక్టర్ మంజీర బండి (చర్మవ్యాధి నిపుణులు) ఈ శిబిరంలో పాల్గొని రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తారని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ, స్వర్ణభారత్ ట్రస్టు (వెంకటాచలం) వారిచే ఉచిత కంటి వైద్యపరీక్షలు కూడా చేసి, అవసరమైనవారికి వెంకటాచలంలోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 08622–295700, లేదా 9154854755 నెంబరుకు గానీ సంప్రదించవచ్చని ట్రస్టు వారు తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వాగ్దానాలను నెరవేరుస్తున్న సీఎం

### - ఇది మంచిప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్




రాష్ట్రంలో ఎన్.డి.ఏ కూటమి ప్రభుత్వం పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు 'ఇది మంచి ప్రభుత్వం – ప్రజా వేదిక' ఏర్పాటు చేయడం జరిగిందని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్.డి.ఏ కూటమి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని, ముందుగా వృద్ధాప్య పెన్షన్ మూడు వేల రూపాయల నుండి నాలుగు వేల రూపాయలకు పెంచి ప్రతినెల 1వ తేదీన వారి ఇంటి వద్ద పెన్షన్ అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా రాబోయే దీపావళి పండుగ నాడు మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందజేసే పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిళ్ళను అందజేశారు.

# కాణిపాకంలో గూడూరు చిన్నారుల నృత్య ప్రదర్శన



గూడూరు శ్రీ సాయి నృత్య బృంద అకాడమి, గూడూరు నాట్య గురువు శైలజ శ్రీనివాస్ నృత్య బృందం ఈ నెల 22వతేదీ కాణిపాకం క్షేత్రంలో నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు చేసిన అందరినీ ఆకట్టుకుంది. ప్రదర్శనకి విచ్చేసిన ప్రముఖులు చిన్నారులని అభినందించారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ కరిముల్లా, విద్యార్థుల తల్లిదండ్రులు, శైలజాకుమారి పాల్గొని సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్‌కళ్యాణ్‌ను, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ విభాగం అధ్యక్షులు వేములపాటి అజయ్‌కుమార్ సారధ్యంలో ఇటీవల మంగళగిరిలో కలిసి విజయవాడ వరద బాధితులకు 2 లక్షల రూపాయలు విరాళం అందిస్తున్న గూడూరు జనసేన నాయకులు కొణిదల మునిగిరీష్.

# జేవీవీ చెకుముకి సైన్స్ పరీక్షలు



గూడూరు జే.వి.వి. ఆధ్వర్యంలో టవర్ క్లాక్ సెంటర్‌లో జే.వి.వి. సభ్యులు చెకుముకి సైన్స్ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయిలో, అక్టోబర్ 1న మండల స్థాయిలో, అక్టోబర్ 27న జిల్లా స్థాయిలో, నవంబర్ 9, 10 తేదీలలో రాష్ట్రస్థాయిలో పరీక్షలు జరుగుతాయని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వారు సహకరించి విద్యార్థులకు సైన్స్ పరీక్ష నిర్వహించి వారిలో సైన్స్ పట్ల అవగాహన కలిగే విధంగా వారి వారి గ్రామాలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేసే విధంగా తయారు చేయాలని, అందుకే విద్యార్థులకు సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జే.వి.వి ప్రతినిధులు పురుషోత్తమ రావు, ప్రభాకర్, పవన్‌కుమార్, సుబ్బారావు, ఆనంద్, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం



పేదల ఆకలి బాధలు తీర్చాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 'అన్న క్యాంటీన్'లు ప్రారంభించారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను ఇటీవల ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌లోనే ఎమ్మెల్యే, నాయకులు భోజనం చేశారు. రూ.5లకే మూడు పూటలా భోజనం అందించడం జరుగుతుందని తెలియజేశారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, గుండాల లీలావతి, పులిమి శ్రీనివాసులు, పి.పురుషోత్తమరెడ్డి, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పిట్టి నాగరాజు, గుండాల భారతి, కల్పన పాల్గొన్నారు.

# తల్లీ పిల్లలకు లయన్స్ దుస్తులు



లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ & టౌన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రి డెలివరీ వార్డులో తల్లి పిల్లలకు దుస్తులు, పోషకాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ సతీమణి అనిత దాతృత్వంతో ఈ కార్యక్రమం జరిగింది. క్యాంప్ ఛైర్మెన్ ఎస్ఎల్ఎన్ స్వామి మురళీనాయుడు, ఆర్‌వి రావు, పాస్ట్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# కోలాహలంగా.. వారాహిదేవి రథయాత్ర

## • నెల్లూరులో పెద్దఎత్తున పూజలు, యాగాలు

నెల్లూరులో ఈనెల 23న పెద్దఎత్తున వారాహిదేవి మహా రథయాత్ర జరిగింది. వందలాది మంది భక్తుల కోలాహలంతో రథయాత్ర అత్యంత వేడుకగా సాగింది. తమిళనాడులోని వారాహి శక్తిపీఠం, తిరుచానూరులోని ఆదివారాహి శక్తిపీఠం స్వామీజీలు యాగరుషి వారాహిస్వామి, మహారుద్ర వారాహిస్వామి పర్యవేక్షణలో తిరుపతి నుంచి బయలుదేరిన ఈ రథయాత్ర ఉదయం 10 గంటల సమయంలో నెల్లూరు నగరానికి చేరుకుంది. ఉగ్రరూపిణి అయిన వారాహిదేవి లోకమాత అని, ఉగ్రరూపంతో ఉన్నంత మాత్రాన వారాహిదేవిని పూజించుకోకూడదనే భావన మంచిది కాదని, ఆ మహాశక్తి స్వరూపిణిని భక్తులంతా పూజించుకోవచ్చని తెలియజెప్తూ ఆదిపరాశక్తి దేవాలయాల ట్రస్ట్‌కు చెందిన వారాహి మహారుద్రస్వామి ఈ సందర్భంగా భక్తులకు ఉద్బోధించారు. నగరంలోని వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్దకు ఈ రథయాత్ర చేరుకోగానే భక్తజనుల ఆనందాతిరేకాలు మిన్నుముట్టాయి. రథయాత్రకు భక్తులు ఘనస్వాగతం పలికారు. మహిళలు కోలాటాలతో, భజనలతో రథయాత్ర కొనసాగింది. అక్కడినుంచి దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం, శబరి శ్రీరామ క్షేత్రం, విఆర్‌సి కూడలి, గాంధీబొమ్మ కూడళ్ళ మీదుగా రథయాత్ర విఆర్‌సి మైదానం వద్దకు చేరుకుంది. వారాహిదేవిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి, శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు చేశారు. వేదమంత్రాలతో మహా హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం వారాహిదేవికి పూజలు చేస్తున్నామని, ఆంధ్రరాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థిస్తూ రాష్ట్రంలోని అనేకప్రాంతాల్లో ప్రత్యేకంగా రథయాత్రలు, యాగాలు చేపట్టాలని నిర్ణయించినట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. అనంతరం, వారాహి సేవాసమితి వారు భక్తులకి ప్రసాదాలు పంపిణీచేశారు.

# పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు

పర్యావరణాన్ని ప్రతిఒక్కరూ పరిరక్షించాలని, పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని కావలిలోని లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 23న కావలిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. ఐసీడీఎస్ అధికారిణులు సౌజన్య, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దీపావళికి ఉచిత సిలిండర్లు

## 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వందరోజుల్లోనే రాష్ట్రంలో అయిదేళ్ళకు అవసరమయ్యే అభివృద్ధి పనులకు పునాదులు వేసిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, నవంబర్-డిసెంబర్ నెలలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వగైరాలన్నీ త్వరలోనే నెరవేరుతాయన్నారు. కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెంలో ఇటీవల నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీచేసి పోయినా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధికి ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగించడం ఆయన సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని కొనియాడారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి దశల వారీగా అమలుచేస్తున్నారని, బుచ్చి పట్టణంలో త్వరలో పేదలకు అండగా 'అన్న క్యాంటీన్' ఏర్పాటు చేస్తున్నట్టు కూడా ఆమె చెప్పారు. తొలుత, స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధనరెడ్డి, ఏటూరి శివరామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయశాఖలో... ఇఓల బదిలీలు

రాష్ట్రప్రభుత్వం వివిధ ప్రభుత్వశాఖల్లో ఇటీవల చేసిన బదిలీల్లో భాగంగా, జిల్లాలోని పలు దేవాలయాల్లో పనిచేస్తున్న ఇఓ (కార్యనిర్వహణాధికారులు)లకు కూడా బదిలీలు జరిగాయి. జిల్లా దేవాదాయశాఖ అధికారి జంజనం శ్రీనివాసరావు నెల్లూరులోని మూలాపేటలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం ఇఓగా బదిలీ అయ్యారు. ఆ ఆలయంతో పాటు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీ మూలస్థానేశ్వరాలయాల అదనపు బాధ్యతలను కూడా ఆయనకు అప్పగించారు. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో దేవాదాయశాఖ అధికారిగా ఉన్న కోవూరు జనార్దన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా దేవాదాయశాఖ అధికారిగా నియమించి, నగరంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం నిర్వహణ బాధ్యతలను కూడా చేపట్టాలని ఆదేశించారు. శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఇఓగా ఉన్న జె.వెంకటసుబ్బయ్యను వైఎస్సార్‌జిల్లాకు బదిలీ చేశారు. శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం ఇఓగా ఉన్న దాసరి చంద్రశేఖర్‌రావును కోటప్పకొండలోని త్రికూటేశ్వరస్వామి వారి దేవస్థానానికి ఇఓగా బదిలీచేశారు. విశాఖపట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవాలయం ఇఓగా ఉన్న పోరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నెల్లూరుజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం.. పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉపకమిషనర్‌గా, ఇఓగా నియమించారు. ఆ దేవస్థానంలో ఇప్పటివరకు విధులు నిర్వహిస్తున్న కేవీ సాగర్‌బాబును, ప్రకాశం జిల్లా మాలకొండలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఇఓగా, ఉప కమిషనర్‌గా నియమించారు.



# జానకిరామ.. రామాయణం (32)

- ఊటుకూరు జానకి రామారావు

లోకంలో చాలామంది స్త్రీలు భర్తచేత అంతకుమునుపు ఎన్ని సుఖాలు అనుభవించినప్పటికీ భర్తలకు కష్టకాలం దాపురించినప్పుడు అతనిని చులకనగా చూస్తారమ్మా! అవసరమైతే ఆ భర్తలను వదిలేస్తారు కూడా! భర్తలపై అనురాగం వారిలో ఒక ఎండమావి!

కానీ గాఢమైన శీలం కలిగిన స్త్రీలు సత్యమునందూ, శాస్త్రమునందూ, సద్గుణములయందు స్థిరచిత్తం కలిగినవారి హృదయంలో భర్తకు మాత్రమే విశిష్ట స్థానముంటుంది. దానిని ఎప్పటికీ పదిలంగా ఉంచుకొంటారు! అని పలికింది కౌసల్యాదేవి.

అత్తగారి మాటలు విన్న సీతమ్మ, ఆవిడకు నమస్కరిస్తూ! పూజ్యురాలా! నా భర్త విషయంలో ఎలాఉండాలో పెద్దలద్వారా విని ఉన్నాను.

నన్ను దుష్టస్త్రీల సరసన చేర్చకమ్మా!

చంద్రుడి నుండి కాంతి విడిపోతుందా!

చక్రంలేని రథం నడుస్తుందా!

తీగలు లేని వీణ మ్రోగుతుందా!

మేమిరువురం "ఒకటి" !

తండ్రి కానీ, తల్లి గానీ, కొడుకు గానీ స్త్రీకి ఇవ్వగలిగింది పరిమితం! భర్త ఒక్కడే అపరిమితంగా ఇవ్వగలవాడు!

ధర్మంలోని సామాన్యవిషయాలు, విశేషవిషయాలు శ్రేష్ఠులైన వారి వద్దనుండి విని ఉండటంవలన నాకు వాటి పట్ల సంపూర్ణమైన అవగాహన ఉంది.

నా భర్తను నేనెట్లా అవమానిస్తాను!

అని సవినయంగా బదులిచ్చింది జనకరాజపుత్రి!

నిత్యం మంగళవాయిద్య ధ్వనులతో మారుమ్రోగే రాజభవనం, నేడు ఏడుపులు పెడబొబ్బలతో దద్దరిల్లిపోతోంది.

రాముడు భార్యా, సోదరసమేతుడై తల్లి కౌసల్యకు ప్రదక్షిణం చేసి నమస్కరించి అదేవిధంగా తక్కిన మూడువందలయాభైమంది తల్లుల వద్ద కూడా అనుమతి తీసుకొని తాను ఇదివరకెన్నడైనా అపరాధాలు తెలియక చేసి ఉంటే మన్నించమని ప్రార్థించి, తండ్రికి కూడా ప్రదక్షిణ నమస్కారాలాచరించి అక్కడే ఉన్న సుమిత్రామాత వద్దకు వచ్చారు.

తనకు నమస్కరిస్తున్న తన కుమారుడు లక్ష్మణుని చూసి, నాయనా భగవంతుడు నిన్ను వనవాసం కొరకే సృష్టించినట్లున్నాడు! ఏమాత్రం ఏమరుపాటు లేకుండా రాముడిని రక్షిస్తూ ఉండు. నాన్నా! ఈ రాముడే నీకు దిక్కు, అతను కష్టాలలో ఉండనీ ఐశ్వర్యవంతుడుగా ఉండనీ గాక.

నీ పెద్దన్నను నీవు ఎల్లప్పుడూ అనుసరించి ఉండు. అది ధర్మం!.

నీ వొదిన సీతమ్మను కన్నతల్లి అనుకో.

నీ అన్న రామయ్యను కన్నతండ్రి అనుకో.

నీవుండే అడవి ఉన్న ఊరు అయోధ్య అనుకో!

హాయిగా సుఖంగా వెళ్ళిరా నాన్నా! అని కొడుకు తల నిమురుతూ పలికింది సుమిత్రాదేవి !

***రామం దశరథం విద్ధి మాంవిద్ధి జనకాత్మజామ్***

***అయోధ్యాం అటవీం విద్ధి గచ్ఛతాత యథాసుఖమ్.***

రాముడు దశరథుడని, సీతమ్మ నేనేనని, అడవే అయోధ్య అని భావిస్తూ.. సుఖంగా వెళ్ళిరా నాయనా!

సుమిత్రామాత నోట వాల్మీకి మహర్షి పలికించిన ఆ మాటలకు కొన్ని విశేష అర్థాలు చెప్పారు కొందరు వ్యాఖ్యాతలు.

రాముని – దశరథమ్ అనగా పక్షి రథంగా గల విష్ణువుగాను

సీతాదేవిని – మామ్ అనగా లక్ష్మీదేవిగానూ,

అడవిని – అయోధ్యామ్ అనగా యుద్ధము చేయుటకు శక్యముగాని వైకుంఠముగా భావించు అని వారివారి భావన!

రాముడు సాక్షాత్తు శ్రీమహావిష్ణువు. సీతాదేవి లక్ష్మి, రాముడు నివసించే అడవి వైకుంఠం.

కౌసల్యా! నా కంటిచూపు తిరిగి రావడంలేదు. నా రాముడి వెనుకనే అదీ వెళ్ళిపోయింది! రాముడి రథం వెనుక పిచ్చివాడిలా పరుగెత్తి పరుగెత్తి అలసి సొలసిన దశరథుడి ఆక్రందన అది.

అంతకు మునుపు సుమంత్రుడు తెచ్చిన రథమెక్కి సీతారామ లక్ష్మణులు ముగ్గురూ పయనమయ్యారు.

ఆబాలగోపాలమూ రథం వెంట పరుగులు తీసింది.

కాసేపు ఆపు సుమంత్రా! ఆ సుందర, సుమనోహర రూపాన్ని మరల ఎన్నాళ్ళకు చూస్తామో అప్పటికి మేం బ్రతికి ఉంటామో లేదో? కాస్త ఆపవయ్యా నీవు మరొక్కమారు కనులారా కాంచుతాం ఆ కమనీయ విగ్రహాన్ని రమణీయ రూపాన్ని.

ఆ కైకకు అదేం పోయే కాలమొచ్చిందిరా తండ్రీ! మా బంగారు



కొండను అడవులపాలు చేస్తోంది. రాముడులేని అయోధ్యానగరం, అరణ్యం ఒకటే! మాకీ నగరమొద్దు! ఈ రాజూ వద్దు!

రామా! నీవెక్కడుంటే అదే మా నివాసం, మా రాజ్యం.

రామయ్యా! ఒక్కసారి మాకేసి చూడయ్యా! సీతమ్మతల్లీ నీవయినా చెప్పవమ్మా తన కరుణార్ద్రదృక్కులు మాపై ప్రసరించనీయమని! రథం రేపుతున్న దుమ్ము చిత్రంగా అణిగిపోతుంది, పురజనుల కన్నీళ్ళు కాలువలై ప్రవహిస్తున్నాయి.

ఇంతలో ఎక్కడినుండో వచ్చినట్లుగా ఆజ్ఞ ఇచ్చేస్వరం, దీనరవం కలగలసి ఒక ఆర్తుడు పెట్టిన కేక అది! సుమంత్రా రథమాపు! రథమాపు! గుర్తుపట్టాడు రాముడు. అది తన తండ్రిది! సుమంత్రా ఇంకా వేగంగా తోలు, నీవు తిరిగి వచ్చినప్పుడు నా ఆజ్ఞ ఎందుకు పాటించలేదని మహారాజడిగితే జనఘోషలో వినపడలేదని చెప్పు.

రథం వెనుక పరుగెత్తి, పరుగెత్తి కూలపడిపోయాడా కన్నతండ్రి!

పడిపోయిన రాజు కుడిరెక్క పట్టుకొని కౌసల్య లేపుతుండగా ఇంతలో కైక ఎడమ భుజం పట్టుకోపోయింది! పాము వంటిమీద ప్రాకినంత జలదరింపుతో ఛీ! దుర్మార్గురాలా! నేటినుండీ నీవు నా భార్యవూ కావు, నేను నీ భర్తనూ కాను. పెళ్ళినాటి ప్రమాణాలకు నేటితో చెల్లు. నీ విచ్చే రాజ్యం తీసుకుంటే భరతుడు వదిలే తర్పణాలు కూడా నాకు చెందవు.. అని కోపావేశంతో కళ్ళెర్ర చేసి కౌసల్యాదేవి మందిరానికి చేరుకున్నాడు మహారాజు.

రాముడే లక్ష్యంగా, రాముని మీదే చూపుగా రొప్పుతూ పరిగెడుతున్నారు రథం వెంట జానపదులు. దయాసాగరుడు వారిని చూశాడు, సుమంత్రుని రథం ఆపమన్నాడు. రథం దిగారు ముగ్గురూ! జానపదుల పదంలో పదం కలిపి నడవడం మొదలుపెట్టి సాగుతున్నాడు రాఘవుడు.

.. (సశేషం)

# ‘రెడ్’బుక్‌తో పాటు ‘రెడ్డీ’బుక్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రత్యేక పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్ర రాజకీయాలలో తలపడుతున్న రెండు ప్రధాన పార్టీలూ ప్రాంతీయ పార్టీలే కావడంతో కులాలు, మతాలు, ముఠాల ఆధిపత్య పోరుకి రాజకీయాలు వేదికగా మారాయంటున్నారు విశ్లేషకులు. ముఖ్యంగా 2014 తరువాత రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రమే మారిపోయిందంటున్నారు సీనియర్ రాజకీయవేత్తలు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఒక్కటే ప్రధాన ప్రాంతీయ పార్టీగా వుంటూ, జాతీయ పార్టీ కాంగ్రెస్‌తో తలపడుతుండడంతో ఇలాంటి పరిస్థితులకి అవకాశమే లేకుండా పోయిందన్నది సీనియర్ల అభిప్రాయం.

రాష్ట్ర విభజనతో పాటు రాజకీయాలు కూడా రెడ్డి, రెడ్డియేతర పార్టీలుగా చీలిపోయాయన్నది వారి భావన. కమ్మ పార్టీగా అవతరించిన తెలుగుదేశంలో ఆ పార్టీ ప్రారంభం నుండీ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవాళ్ళు చాలామందే ఉన్నారు. అయితే, ఈసారి మంత్రివర్గ కూర్పులోనూ, మొన్న తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పదవులలోనూ ఆ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత లభించలేదన్న మాట పరిశీలకుల నుండి వినిపిస్తోంది. ఇప్పటికే గత జగన్ ప్రభుత్వంలో ఆ ప్రభుత్వానికి కొమ్ము కాసిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పేర్లతో ఒక రెడ్‌బుక్‌ని లోకేష్ తన వద్ద పెట్టుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఎన్నికల ప్రచార సమయంలో కూడా ఆయన తరచూ ఆ పుస్తకాన్ని చూపిస్తూనే ఉన్నారు. అయితే, ఇప్పుడు కొత్తగా గత ప్రభుత్వంలో వైసీపీలో కీలకంగా వ్యవహరించిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగులు, నాయకుల జాబితాతో కూడా మరో రెడ్‌బుక్ చిన్నబాబు తయారు చేసుకున్నాడని రాజకీయవర్గాల సమాచారం.

### ఉద్యోగుల బదిలీలలో స్పష్టమైన వివక్ష!

మొన్న సెప్టెంబర్ 22వ తేదీ వరకూ జరిగిన బదిలీల ప్రక్రియలో కూడా రెడ్డి సామాజికవర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని కొంతమంది ఉద్యోగ నేతలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగుల బదిలీలలో కూడా ఇలా కుల వివక్ష చూపించి బదిలీల ప్రక్రియ కొనసాగించడం సముచితం కాదని వారు వాపోతున్నారు. చాలామంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగస్తులని ప్రాధాన్యత లేని స్థానాలలో నియమించారు. మరికొంతమందికి అసలు పోస్టింగులే ఇవ్వకుండా ప్రధాన కార్యాలయాలలో రిపోర్టు చేయవలసిందిగా ఆదేశించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వ పెద్దల ఆదేశాలు తాము పాటిస్తామని, ఇలా తమపై కుల ముద్ర వేసి శిక్షించడం సరైన విధానం కాదని రెడ్డి సామాజిక ప్రభుత్వ ఉద్యోగులు మండిపడుతున్నారు.

### రాజకీయ పదవుల్లో కూడా చిన్నచూపు!

రాజకీయ పదవులు ఇవ్వడంలోనూ, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ రెడ్లకి అన్యాయం జరుగుతుందని టీడీపీ పార్టీలోని రెడ్డి సామాజికవర్గ నేతలు చెప్తున్నారు. ఏదైనా పదవి ఇచ్చేముందు చివర వున్న తోకని చినబాబు చూస్తున్నాడని, అలా చూడడం అన్యాయమని ఆవేదన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి సామాజిక వర్గానికి తీరని ద్రోహం చేశాడని ఆ సామాజికవర్గ నేతలు అంటున్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ రెడ్లని అనాధలని చేశాడని.. దాని ఫలితమే మొన్నటి ఎన్నికలలో రెడ్డి సామాజికవర్గం 80శాతం మంది జగన్ ఓటమి కోసం కష్టపడ్డారని చెప్తున్నారు. ఆ విషయాన్ని కూటమి నేతలు గుర్తుపెట్టుకోవాలని సూచిస్తున్నారు. ఉప్పు – నిప్పుగా వున్న కమ్మ, కాపు ఒక్కటై రెడ్డి సామాజిక వర్గాన్ని అణగ తొక్కాలని ప్రయత్నిస్తే జగన్‌మోహన్ రెడ్డి లాగా వారు తీసుకున్న గోతిలో వారే పడతారన్న విషయాన్ని గ్రహించాలని కూటమి నేతలకి సూచిస్తున్నారు. ఇప్పటికే కమ్మ, రెడ్డి పార్టీలుగా టీడీపీ, వైసీపీ ఏర్పడి కులరాజకీయాలకి రాష్ట్రాన్ని వేదిక చేస్తుంటే... వీరికి తోడుగా మూడవ పార్టీ జనసేన ఆవిర్భవించి వాటికి మరింత బలాన్ని చేకూర్చడం ఎవరికీ మంచిది కాదని రాజకీయ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఇలాంటి రాజకీయాలు రాష్ట్ర నాశనానికి తప్ప సంక్షేమానికి ఉపయోగపడవని అభిప్రాయపడుతున్నాయి. రెడ్‌బుక్‌ని, రెడ్డిబుక్‌ని పక్కనపెట్టి అన్ని కులాల వారినీ, మతాల వారినీ సమన్వయ పరచుకుని పరిపాలన సాగించాలని సీనియర్ రాజకీయవాదులు కోరుకుంటున్నారు. ఇలా కుల రాజకీయాలకి ఆజ్యం పోస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందని ఆందోళన చెందుతున్నారు!



## ‘మురళీకృష్ణ హోటల్’ అధినేతల విరాళం.. 5 లక్షలు

విజయవాడ వరదబాధితులను ఆదుకునేందుకు తమవంతు సాయంగా నెల్లూరులోని ప్రముఖమైన మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేతలు గ్రోసు సుబ్బారావు, గ్రోసు మురళీకృష్ణలు ముందుకొచ్చారు. ఈనెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఆమేరకు 5 లక్షల రూపాయల విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని అభినందించారు. వీరితో పాటు మంత్రి నిమ్మల రామానాయుడు కూడా ఉన్నారు.

## దేశం గర్వించదగ్గ గాయకులు..మహమ్మద్ రఫీ



స్వర్గీయ మహమ్మద్ రఫీ దేశం గర్వించదగ్గ ప్రముఖ గాయకులని, హిందీ చిత్రసీమతో పాటు సంగీతాభిమానులందరి మనసుల్లో ఆయన శాశ్వతమైన ముద్రవేసుకున్నారని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన యాద్–ఏ–రఫీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహమ్మద్ రఫీ ఏ సినిమాలోనైనా పాటలు పాడితే ఆ సినిమా తప్పనిసరిగా హిట్ అయ్యేదని, ఆయన మరణించి 44 ఏళ్లు అవుతున్నా మనం ఇంకా గుర్తు పెట్టుకున్నామంటే ఆయన గానమాధుర్యం అలాంటిదని అన్నారు. నెల్లూరులో ఎంతోకాలంగా యాద్–ఏ–రఫీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ ప్రతినిధులు, ముఖ్యంగా జాకీర్, జావీద్‌లను ఆయన అభినందించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌తో కలసి, వారిని ఆయన ఘనంగా సత్కరించారు.







# ‘అమ్మ’.. ఇక లేరంటూ... అందరి కంటా కన్నీరు!

పేదల పాలిట అమ్మగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే తల్లిగా అందరి అభిమానం చూరగొన్న ప్రజాసేవకురాలు.. మాగుంట పార్వతమ్మ ఇక లేరనే విచారంతో.. ఆమె పార్థివదేహాన్ని దర్శించుకున్నవారంతా కన్నీరు మున్నీరయ్యారు. ఎందరో ప్రముఖులు, అశేషప్రజానీకం, మాగుంట కుటుంబ అభిమానులతో మాగుంట నివాసప్రాంతమంతా నిండిపోయింది. గురువారం మధ్యాహ్నం పార్వతమ్మ మనుమడు మాగుంట సుబ్బరామ్ రెడ్డి అంత్యక్రియల కార్యం నిర్వర్తించగా, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యవేక్షణలో ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు జరిగాయి. పెద్దసంఖ్యలో నాయకులు, అభిమానులు బంధుమిత్రులు ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ మంత్రి బాలినేని, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎంపీ పనబాక లక్ష్మి – కృష్ణయ్య దంపతులు, జడ్పీ మాజీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, కరణం బలరామ్, నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయులు, సురేంద్రరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్ రెడ్డి తదితరులు పార్వతమ్మకు కడసారి కన్నీటి నివాళులర్పించారు.














### ప్రారంభమైన..
# శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దీక్షలు

శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో అనేకమంది భక్తులు ఏటా అమ్మవారి మాలధారణతో పూజలు చేయడం తెలిసిందే. ఈ ఏడాది కూడా భక్తులు, అమ్మవారికి ప్రీతిపాత్రమైన శుక్రవారం రోజున నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయానికి పెద్దసంఖ్యలో వచ్చి మాలధారణ చేసుకుని శ్రీ భవాని దీక్షలు ఆరంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ ఆధ్వర్యంలో మాలధారణ జరిగింది. 21రోజులపాటు జరిగే ఈ దీక్షల్లో వందలసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొంటుండడం విశేషం. అక్టోబరు11వ తేదీన అమ్మవారికి ఇరుముడి సమర్పించి దీక్షలు విరమిస్తారు. శ్రీ రాజరాజేశ్వరిదేవి సేవాసమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆలయ వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యల నేతృత్వంలో ఈ దీక్షలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి.

### మనుబోలు బాధితులకు..
# టీడీపీ నాయకుల చేయూత



మనుబోలు బీసీకాలనీలో బాణసంచా పేలుళ్ళ బాధితులకు ఈనెల 23న టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లక్ష రూపాయలు ఇవ్వగా, మరి కొందరు టీడీపీ నాయకులు కూడా 3లక్షల రూపాయలు తమ వంతు చేయూతగా అందించారు. ఆ మొత్తంతో, పేలుళ్ళ ఘటనలో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న వారికి రూ. 10వేలు, గాయపడినవారికి 5వేలు, పేలుళ్ళతో దెబ్బతిన్న ఇళ్ళకు తగు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు వెంకటరమణయ్య ఆధ్వర్యంలో చెల్లగిరి ప్రసాద్, అమీర్‌బాషా, దండు చంద్రశేఖర్ రెడ్డి, పచ్చిపాల చంద్రశేఖర్‌రెడ్డి, ఏకాంబరం సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుభాషకు..
# గురజాడ సేవలు మార్గదర్శకం



తెలుగుభాషకు మహాకవి గురజాడ చేసిన సేవలు మార్గదర్శకమని, వ్యావహారిక భాషోద్యమంతో తెలుగుభాష మరింతగా వ్యాప్తిలోకి వచ్చేందుకు ఆయనెంతో కృషిచేశారని ప్రముఖ సాహితీవేత్త, 'శ్వేత' మాజీ డైరెక్టర్ భూమన్ కొనియాడారు. ఇటీవల నెల్లూరు వర్ధమానసమాజం భవనంలో జరిగిన గురజాడ 162వ జయంతిసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గురజాడ రచనల విశిష్టతను వివరించారు. లతీఫ్‌కుట్టి సభకు అధ్యక్షత వహించగా, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, మెట్టు రామచంద్రప్రసాద్, చిరసాని కోటిరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. డా.ఎం సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# శ్రీసిటీకి మరో విశిష్టమైన అవార్డు



పరిశ్రమల రంగంలో ఆణిముత్యంగా, అంతర్జాతీయస్థాయి ప్రముఖ పారిశ్రామిక వాడగా పేరొందిన శ్రీసిటీ తన ఉత్తమ సేవలతో ఇటీవల మరో ప్రతిష్టాత్మక అవార్డును అందుకుంది. ఎంతో విశిష్టతమైన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంస్థ వారి 'సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్' ఈసారి శ్రీసిటీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఆర్.నాగరాజన్‌కు లభించింది. ఈనెల 20న బెంగుళూరులో నిర్వహించిన సదరన్ రీజియన్ సిఐఐ సీఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డుల 3వ ఎడిషన్ కార్యక్రమంలో ఆయనకు ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందచేశారు. సిఐఐ మాజీ ప్రెసిడెంట్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్, యాక్సిలర్ వెంచర్స్ ఛైర్మెన్ క్రిస్ గోపాలకృష్ణన్, సిఐఐ సిఎఫ్ఓ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023-2024 చైర్మన్, భారత్ వోల్వో గ్రూప్ ప్రెసిడెంట్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి చేతులమీదుగా ఆయన అవార్డును స్వీకరించడం విశేషం. మౌళిక వసతుల కల్పన రంగంలో ఆర్థిక నిపుణుడుగా చూపిన అసాధారణమైన ప్రతిభ, కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సీఎఫ్ఓకు అభినందనలు తెలిపిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ ప్రతిష్టాత్మిక అవార్డు సాధించడం తమకు చాలా గర్వంగా వుందన్నారు. ఆర్థికరంగ నిపుణులను ప్రోత్సహిస్తూ ఏటా అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సిఐఐ సంస్థను కూడా ఆయన అభినందించారు. ప్రస్తుత ప్రతిష్టాత్మక అవార్డుతో పాటు గతంలో పలు అవార్డులను కూడా నాగరాజన్ అందుకున్నారు. 2022లో సీఎఫ్ఓ ఇండియా సంస్థ నుండి సీఎఫ్ఓ-100 అవార్డు, 2021లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నుండి 'బెస్ట్ సిఎంఏ సీఎఫ్ఓ' అవార్డు, 2021లో ఆసియా సీఎఫ్ఓ లీడర్‌షిప్ అవార్డులలో 'సీఎఫ్ఓ ఆఫ్ ది ఇయర్' గౌరవాన్ని సొంతం చేసుకుని శ్రీసిటీ ప్రతిష్టను ఇనుమడింపజేశారు.

# వరద బాధితులకు 'వాకర్స్' సాయం



విజయవాడ వరద బాధితుల సహాయార్థం నెల్లూరు నగరంలోని పలు వాకర్స్ సంఘాలు తమ సాయం అందించాయి. మొత్తం రూ. 2,42,200లను సీఎం సహాయ నిధికి పంపుతూ, ఆ చెక్కులను జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌కు వారు ఇటీవల అందజేశారు. విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ వారు లక్ష రూపాయలు, ఆర్ఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ రూ. 75వేలు, ఎస్‌పిఎస్ఆర్ జడ్పీ వాకర్స్ అసోసియేషన్ రూ. 50వేలు, పుత్తా ఎస్టేట్ వాకర్స్ అసోసియేషన్ రూ. 5వేలు, మై వాకర్స్ అసోసియేషన్ రూ. 12,200ల వంతున విరాళం అందజేయగా, వారిని జాయింట్ కలెక్టర్ అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నళినీమోహన్, సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎం.వి.సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, మెట్టు సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుజన, చెంచయ్య, పర్వీన్, దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో...

వరద బాధితుల సహాయార్థం నెల్లూరులోని ఫ్రెండ్స్‌వాకర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 24న లక్షా 10వేల రూపాయలను తమవంతు సాయంగా అందజేశారు. ఆ మొత్తాన్ని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ బిరదవోలు రామమోహన్‌రెడ్డి, 203 జిల్లా గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, వాకర్స్ ఇంటర్ నేషనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, మాగంటి ప్రసాద్, కిలారి దినేష్, జి.నారాయణ రెడ్డి, పత్తిపాటి రమణయ్య, కె వెంకటరమణ, బి. చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్ఐలైన.. హెడ్‌కానిస్టేబుళ్ళు

ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న 24 మంది హెడ్‌కానిస్టేబుళ్ళకు ఏఎస్ఐలుగా ప్రమోషన్ ఇస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీంతో ఎస్.భాస్కర్‌రెడ్డి (ఏఎస్‌పేట), షేక్ రియాజ్‌అహ్మద్ (చిన్నబజారు, ఏవీ ప్రసాద్ (సౌత్‌ట్రాఫిక్), వై.శ్రీహరిబాబు(పోలీస్ కంట్రోల్‌రూమ్), షేక్ జిలానీ(డీటీసీ), వై.మాల్యాద్రి (ఆత్మకూరు), బి.మునిరావు(వేదాయపాళెం), పి.రాజగోపాల్(మనుబోలు), ఎం.వెంకటేశ్వర్లు(ఆత్మకూరు), కెవెల్ నరసయ్య(చిన్నబజారు), కె.ఉమామహేశ్వరరావు (సౌత్‌ట్రాఫిక్), ఎం.వి రమణారెడ్డి (సీఐడీ విభాగం), వి.మాధవరావు (వేదాయపాళెం), ఎస్‌కె కరిముల్లా (కొడవలూరు), సిహెచ్ సురేంద్రబాబు(డిఎస్‌బీ), సి.శ్రీధర్‌రావు(విఆర్), ఎన్.మునికృష్ణయ్య (చిన్నబజారు), షేక్ బాబా(ఇంటెలిజన్స్), వి.శ్రీనివాసులు (ఆత్మకూరు) ఏఎస్ఐలయ్యారు. అదేవిధంగా, తిరుపతి జిల్లాకు చెందిన పి.కృష్ణ, పి.చంద్రయ్య, షేక్ ఖాదర్‌మస్తాన్, షేక్ అహ్మద్‌బాషా, సి.వెంకటేశ్వరరావులు కూడా ప్రమోషన్లు పొందారు.

## టూకీగా...



### ఏఎస్‌పేట దర్గాలో 'స్వచ్ఛతా హి సేవ'

జిల్లాలోని ప్రముఖ క్షేత్రమైన ఏఎస్‌పేట (అనుమసముద్రంపేట) దర్గాలో ఈనెల 21న 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం చేపట్టి పరిసర ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు ఏరివేసి పరిశుభ్రం చేశారు. దర్గా ఏఇఓ షేక్ షరీఫ్, అకౌంటెంట్ ఖాజా హుస్సేన్, దర్గా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిహెచ్ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు

### కందుకూరులో రక్తదాన శిబిరం

కందుకూరులోని టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల21న రక్తదాన శిబిరం నిర్వహించారు. అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డా.ఎం.రవికుమార్, ఏరియా ఆసుపత్రి డాక్టర్ మహమ్మద్‌షజీఉద్దీన్, టెక్నీషియన్ ఎస్.రామారావు, స్టాఫ్‌నర్సు శ్రీలత, సుకుమార్, శివాజీ పాల్గొన్నారు.

### రేవూరులో స్కూల్ గేమ్స్ పోటీలు

అనంతసాగరం మండలం రేవూరులో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీలు ఈనెల 21తో ముగిశాయి. ఫిజికల్ డైరెక్టర్ గౌరిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మండలంలోని ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలైనవారు ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్లు తెలిపారు.

### సైదాపురంలో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన

మండల కేంద్రమైన సైదాపురంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సీడీపీఓ సునంద ఆధ్వర్యంలో ఈనెల 21న బాలికలకు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కలిగించారు. పోషకవిలువలతో కూడిన ఆహారపదార్థాలు తీసుకోవాలని, చిరుధాన్యాలు వంటివి ఆరోగ్యకరమైనవని చెప్పారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### బుక్కాపురంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

వింజమూరు మండలంలోని బుక్కాపురం గ్రామంలో ఈనెల 21న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో పాఠశాలలోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించి గర్భిణులకు పోషకాహారం పట్ల అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### బండేపల్లిలో గంగమ్మకి గ్రామోత్సవం

మనుబోలు మండలంలోని బండేపల్లిలో ఈనెల 20వ తేదీ అర్ధరాత్రి నుంచి 22వ తేదీ వేకువ వరకు గంగమ్మ తల్లి గ్రామోత్సవాన్ని గ్రామస్తులు అంగరంగవైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం వారి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు అభిషేకాలు ఘనంగా జరిగాయి. ఉత్సవకమిటీ సభ్యులు రవి, నరేంద్రబాబు, యోగేశ్వరరావు పర్యవేక్షించారు.

### మినగల్లులో.. నేరాల నియంత్రణపై సదస్సు

బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు గ్రామంలో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు సీఐ పి.శ్రీనివాసులురెడ్డి అవగాహన కలిగించారు. సర్పంచ్ పూజిత, పంచాయతి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కందలపాడులో పశువైద్య శిబిరం

వెంకటాచలం మండలంలోని కందలపాడులో ఈనెల 23న ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. స్వర్ణభారత్ ట్రస్టు, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కనుపూరు పశు వైద్యాధికారిణి ఎన్.సుష్మ పాల్గొని పశువులకు చికిత్సలు చేసి, రైతులకు వాటి సంరక్షణ పట్ల తగు సలహాలనిచ్చారు.

### కావలిలో మునిసిపల్ వర్కర్లకు ఉచిత వైద్యపరీక్షలు

'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా ఈనెల 23న కావలిలోని మునిసిపల్ వర్కర్లకు కావలి ప్రభుత్వాసుపత్రిలో ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొని మునిసిపల్ కార్మికులకు, వారి కుటుంబసభ్యులకు వైద్యపరీక్షలు చేసి, తగు ఆరోగ్యసలహాలనిచ్చారు.

# దండాలమ్మా పోలేరమ్మా!...

## • వెంకటగిరి జాతరకు పోటెత్తిన భక్త జనం



జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన వెంకటగిరి పోలేరమ్మ అమ్మవారి జాతర బుధ, గురువారాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల కొంగుబంగా రంగా, కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా, చల్లనితల్లిగా ప్రసిద్ధిచెందిన వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారికి జరిగే ఈ జాతరలో పాల్గొనేందుకు భక్తజనులు ఈ రెండు రోజుల్లో లక్షలాదిగా తరలివచ్చారు. దీంతో వెంకటగిరి భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వీధివీధినా అమ్మవారి జాతర వేడుక మిన్నుముట్టింది. ప్రజలు ఇంటింటా గడపలకు వేపమండలు కట్టి, పూలతో అలంకరించి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. జాతరలో కీలక ఘట్టమైన అమ్మవారి విగ్రహం తయారీ బుధవారం సాయంత్రానికి పూర్తయింది. పుట్టినిల్లయిన కుమ్మరివారింట అమ్మవారి ప్రతిమను అత్యద్భుతంగా రూపొందించి పూజలు చేశారు. వెంకటగిరి రాజావారి కుటుంబీకులు సమర్పించిన పట్టుచీరను అమ్మవారికి అలంకరించారు.

రాష్ట్రపండుగగా వెంకటగిరి జాతర హోరెత్తింది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో జాతర వైభవోపేతంగా జరిగింది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి రాజా కుటుంబీకులు, వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితర ప్రముఖులెందరో అమ్మవారిని ఈ జాతరలో దర్శించుకుని తరించిపోయారు. మంత్రి రామనారాయణ చొరవతో జాతరకు రాష్ట్రప్రభుత్వం 50 లక్షల రూపాయలను విడుదల చేయడం విశేషం!

గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర దేవా దాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అమ్మవారి నగరోత్సవానికి ఇసుకేస్తే రాలనంతంగా జనం తరలివచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.






## మెట్టప్రాంత ప్రజల దాహార్తి తీరుస్తాం!..

# మరిన్ని వాటర్‌ప్లాంట్లు నెలకొల్పుతాం!

### - 'సేవాభూషణులు'.. ఎంపీ విపిఆర్ హామీ



జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు సొంత నిధులు వెచ్చిస్తూ, పరిశుద్ధమైన జలాలను అందజేస్తున్న అపరభగీరథుడు.. సేవాభూషణుడు.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి మరిన్ని 'అమృతధార' వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 25వ తేదీన ఆయన ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పంచాయతీలో ఉన్న సాతానివారిపాళెం, ఎస్టీ కాలనీల్లో 'విపిఆర్ అమృతధార' వాటర్‌ప్లాంట్లను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ఇప్పటికే సుమారు 150 వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేశామని, తొలి వాటర్‌ప్లాంట్‌ను అప్పట్లో ఉదయగిరి నియోజకవర్గంలోనే ప్రారంభించామని గుర్తుచేశారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో క్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, ఆ సమస్యను అధిగమించాలనే ఆలోచనకు కార్యరూపమే 'విపిఆర్ అమృతధార' అని ఆయన చెప్పారు. కేవలం వాటర్ ప్లాంట్స్ ఏర్పాటుచేయడమే కాకుండా వాటి నిర్వహణను కూడా విపిఆర్ ఫౌండేషన్ తరఫునే చేయిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా వేమిరెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, సొంత నిధులతో విపిఆర్ అమృతధార వాటర్‌ప్లాంట్లు పెట్టి మెట్ట ప్రాంత ప్రజలకు తాగునీరు అందిస్తుండడం గొప్పవిషయమని అంటూ, విపిఆర్‌కు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com